సంపుటి 44 సంచిక 123 డిశెంబర్ 2019

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



## విషయ సూచిక

సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి...............................................................................2

సెక్రెటరీ రిపోర్ట్ – వాణి మోటమఱ్ఱి ...............................................................................3

### శీర్షికలు

శ్రీమద్భగవద్గీత - పెయ్యేటి రంగారావు...............................................................................7

హనుమంతుడు - ద్విపద పద్యాలు విజయ చావలి...............................................................................10

కొంటె బొమ్మల బాపు ...............................................................................12

బాపు చిరస్మర(మ)ణీయులు - పెయ్యేటి శ్రీదేవి...............................................................................15

తెలుగు బడి పిల్లలు - ఉషా శ్రీదేవి...............................................................................18

గాన గంధర్వుడు - షామీర్ జానకీ దేవి...............................................................................21

ఆమె వెర్సస్ దేముడు - పెయ్యేటి రంగారావు...............................................................................26

మనోనిబ్బరం - విజయ గొల్లపూడి...............................................................................28

దీప భ్రమరన్యాయం - డి.కామేశ్వరి...............................................................................35

బంగారి గాజులు - ఆలూరి పార్థసారథి...............................................................................41

సంగీతనాదామృతం - పద్మ మల్లెల ...............................................................................47

పాట నేర్చుకుందామా, పాడుకుందామా...............................................................................55

భరతఖండము, అక్షరఖండము అక్షరభూమి - ఉమామహేశ్ శెనగవరపు...............................................................................57

బాలవాహిని...............................................................................59

భాషాప్రభావం - ప్రవీణ రాచకొండ...............................................................................61

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

తెలుగు భాషాభిమానులు, వాహిని ప్రియపాఠకులకు నమస్సులతో డిశెంబర్ మాసపత్రిక చదవటానికి మీకిదే మా ఆహ్వానం. మార్గశిరమాసంలో ఇంటి ముంగిట ముగ్గులు తీర్చిదిద్దటం మన ఆనవాయితి. ధనుర్మాసంలో తిరుప్పావై పాశురాలు శ్రవణం శుభదాయకం.

సందేశాత్మక కధలు, మన తెలుగువారి వ్యాసాలతో పాటు, మన తెలుగుతనం ఉట్టిపడే చిత్రాలు, బొమ్మలు అందించిన బాపు గారి జయంతి సందర్భంగా ప్రత్యేక కధ, అమరగాయకుడు ఘంటసాలగారిని తలపింపచేసే వ్యాసం మరెన్నో ఆసక్తికరమైన అంశాలతో ఈ నెల వాహిని పత్రికను తీర్చిదిద్దాము. చూస్తూ చూస్తూ ఉండగానే కాలచక్రం గిర్రున తిరిగిపోతూ ఉంటుంది. కాలాన్ని ఆపటం ఎవరివల్ల కాదు. కాలంతోటే మనం పరుగులు పెట్టాలి. చుట్టూ చూస్తే టెక్నాలజీ, ఎన్నో వింత ఆకర్షణలు. కానీ వాటిలో మనకు అవసరమైన వాటిని, ఇష్టమైనవాటిని ఎంచుకుని, ఏకాగ్రతతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమయపాలన పాటించాలి. గడచిన సంవత్సరం ఎన్నో జ్ఞాపకాలు మిగులుస్తుంది. జీవితపాఠాలను నేర్పుతుంది.జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు తప్పకుండా ఓ పరిష్కారం ఉండనే ఉంటుంది. నిరంతర శోధనతో ఆ చిక్కుముడులకు జవాబులు కనుక్కోవడంలోనే మానవమేధస్సు ముడిపడి ఉంది. సమస్య అనే తాళానికి పరిష్కారమనే తాళం చెవి ఆ భగవానుడు తప్పక ఒకచోట పెట్టే ఉంటాడు. ఆ తాళం ఎక్కడ ఉందో కనుక్కోవడమే మన కర్తవ్యం.

పిల్లలు, పెద్దలు కలసి ఆనందించడానికై ఎదురుచూస్తున్న క్రిస్మస్ హాలిడేస్ దగ్గరకి వచ్చేస్తున్నాయి. రచయితలు, వాహిని పత్రికను ప్రోత్సాహిస్తున్న పాఠకులు, ప్రకటనదారులు, మిత్రులు అందరూ సుదీర్ఘమైన సెలవులలో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాము. ప్రస్తుతానికి వాహిని పత్రిక చదవడానికి మీ సమయాన్ని కేటాయించగలరని భావిస్తూ.......

మీ శ్రేయోభిలాషి

విజయ గొల్లపూడి

0438293687

vahini@sydneytelugu.org

## ఎక్జిక్యుటివ్ కమిటీ

| | |
|---|---|
|  | ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు<br>0408 469 758 |
|  | వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి<br>0425 209 397 |
|  | సెక్రెటరీ: వాణి మోటమఱ్ఱి<br>0418 184 111 |
|  | ట్రేసరర్:మూర్తి ఒలేటి<br>0402 137 475 |
|  | కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం<br>0431 714 501 |
|  | కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526 |
|  | కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి<br>0425 291 032 |

## సబ్ కమిటీలు

| | |
|---|---|
|  | వాణి కన్వీనర్ : సారధి మోటమఱ్ఱి<br>0430 002 130 |
|  | వాహిని ఎడిటర్:<br>విజయ గొల్లపూడి 0438 293 687 |
|  | తెలుగు స్కూల్ కోఆర్డినేటర్<br>మల్లిక్ రాచకొండ 0431 680 092 |
|  | వనితా మండలి కోఆర్డినేటర్<br>శోభ వెన్నలకంటి - 8901 3636 |
|  | వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల<br>0400 031 546 |
|  | సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్<br>రవి సీతంరాజు |

## UIA మెంబర్

| | |
|---|---|
|  | శ్రీని పిల్లమఱ్ఱి<br>0452 025 666 |

## ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)

| | |
|---|---|
|  | మూర్తి పోతుకూచి |
|  | శ్రీనాధ్ ఖండవల్లి |
|  | సుందరం రాచకొండ |
|  | ఆడిటర్<br>మధు వెన్నెలకంటి |
|  | పబ్లిక్ ఆఫీసర్<br>రవి సీతంరాజు |

# SECRETARY REPORT

Dear Members and Friends,

November month is always packed with lots of activities and we have walked through the same busy schedule this year also.

I would like to focus this report on listing and giving some highlights of our 2019 Deepavali Vedukalu which took place on 2nd Nov'19 @ Sri Durga Devi Devasthanam Auditorium.

- Event started with a Welcome Note by Smt. Vani Motamarri, Secretary-STA and was handed over to MC – Smt. Punya Paturi, Radio Broadcaster-STA
- Smt. Shoba Vennelaganti, Convenor-Vanitha Mandali, STA & Smt. Aruna Subbarao did the Deepa Prajwalana followed by a Prayer Song and a Keerthana by Sri. Mohan Parasu, Executive Committee Member -STA
- We had excellent performances by our Local Talent which include Padyalu, Dances and Skit by Telugu Badi students (27 in total) from Darcy Rd, Eastwood, Strathfield South and Kellyville Schools, Instrumental Music by Youth, Traditional Kuchipudi dance by students of Mayura Academy on Ashta Lakshmi Stotram, Folk on Veena and light music.
- The Main Performance was from Overseas Guest Artists – Smt. Aruna Subbarao who has 30 over years of experience in Telugu Cultural arena such as Folk, Modern music, parody etc. And Sri. M L Raaja, very young, dynamic, multi-talented, lyric writer, singer, multi instrument player, music programmer, music director, choreographer and music studio academy owner. They have written the lyrics choreographed, and presented us an STA Welcome song which we can play for years to come.
- Guests of Honor for the day were:
    - Hon Dr. Geoff Lee-MP, Member for Parramatta, Acting Minister for Multi Culture
    - Mrs. Aruna Chandrala to represent Jodi Mckay- MP, NSW Labor Leader in her absence to deliver her message
    - Sri. Dharam Pal, Vice Consul, Consulate General India representing Consul General
    - Dr. Krishna Nadimpalli, recent recipient of Medal of the Order of Australia
- Dr. Geoff Lee, honoured Smt Aruna Subbarao and Sri M L Raaja and presented them a Momento specially prepared for them sighting their achievements.

- In recognition of Dr. Nadimpalli's professional and community support, Sydney Telugu Association prepared a Special Commendation Award. Sri. Dharam Pal presented the Award during the felicitation.

Executive Committee would like to convey our sincere appreciation to all the Sponsors, Artists, Participants, Event Guests and Volunteers. Special thanks to Smt. Punya Paturi who has done an excellent job as an MC.

Upcoming Events:

- **3.30 pm – 8 pm, 7th December 2019** – Retirement Planning/Retirement Ready" by an expert from a leading super fund followed by Q&A

Best Regards,
Vani Saradhi Motamarri
Secretary, Sydney Telugu Association

Please follow the linkt to watch STA Diwali Celebrations.

https://www.youtube.com/watch?v=fvsaMcwiWgI

❖❖❖❖❖`

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

❖❖❖❖❖

## విజ్ఞప్తి

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖




## *Deepavali 2019 Event Sponsors and Volunteers*

| Annual Sponsor | Event Sponsors |
|---|---|
| AAS Tax | ANZ |
| Apex Dental | Family Care |
| ARA Vaults | New dental |
| Central Equity | Railway road Medical |
| Indaus Immigration | SMG Stone |
| Mirchi Masala & Bluginger | Srilakshmi store |
| Paradise Biriyani | Utsav |
| Rainbow Dental | Vinflora |
| Ray Accounting | **Stalls** |
| Siri Sampada | Dr Madhuri- Miranda family dentist |
| Softlabs | Indian Support Centre |
| Swagath | Nalini Rajkumar-Saree Stall |
| Taxnet | Tansi collections |
| Vins Taxation | Kaivaram Dental |
| Westmead Doctors | |
| **Volunteers** | |
| Shoba Vennelakanti | Jyothi Voleti |
| Vani Varadaraju | Vijaya Gollapudi |
| Swaraj Byreddy | Aparna Peddhibotla |
| Deepa Kiran Bagepally | Nilima Kolluri |
| Umadevi Abbineni | Shakuntala Bhrugubanda |
| Malleswari | Prasanna Vedantam |
| Lakshmi Danthurty | Jaya Vutukuru |
| Malathi Pola | Punya Paturi |
| Manjusha Peddada | Sirisha Koduri |
| Sarita Janagama | Srinath Khandavalli |
| Rambabu Matta | Nagendra Kumar Bysani |
| Ravi Srinivasan | Gopal Gatiganti |
| Rajesh Bagepally | Sai Gollapudi |
| Rao Peddada | Chandrasekhar Rayaprolu |

Executive Committee would like to convey our sincere appreciation to each and all. We are sorry if we have missed to acknowledge anyone.

# శ్రీమద్భగవద్గీత

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అధ ప్రథమోధ్యాయః = అర్జున విషాదయోగః (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)**

**4,5,6.**

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి |
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః || 4 ||

ధృష్టకేతుశ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ |
పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః || 5 ||

యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ |
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ||6 ||

అత్ర = శత్రుభూతమగు నీ సైన్యమునందు

శూరాః = స్వయముగ భయము లేక శస్త్రాస్త్రములందు నేర్పరులు

మహేష్వాసాః = గొప్ప విలుకాండ్రు

యుధి = యుద్ధమునందు

భీమార్జునసమాః = భీమార్జునులతో సమానమైన వారును

కలరు. వారెవరనిన,

యుయుధానః = విశేషముగ యుద్ధము చేయు సాత్యకి,

విరాటశ్చ = శత్రువులను విశేషముగ రోదనధ్వనిని చేయించు విరాటరాజు,

మహారథః = మహారథికుడగు

ద్రుపదశ్చ = వృక్షము ధ్వజమునందు చిహ్నముగా గల ద్రుపదరాజును,

ధృష్టకేతుః = ధృష్టకేతువు (చేదిదేశపు రాజు, శిశుపాలుని పుత్రుడు)

చేకితానః = చేకితానుడు,

వీర్యవాన్ = పరాక్రమవంతుడగు

కాశీరాజః = కాశీరాజును,

పురుజిత్ = యుద్ధమునందనేకులను జయించు పురుజిన్మహారాజును,

కుంతిభోజశ్చ = కుంతిభోజుడును, (పురుజిత్, కుంతిభోజుడు కుంతీదేవికి సోదరులు)

నరపుంగవః = నరశ్రేష్ఠుడగు

శైబ్యశ్చ = శైబ్యుడును

విక్రాంతః = పరాక్రమము గల

యుధామన్యుశ్చ = యుధామన్యువును,

వీర్యవాన్ = పరాక్రమము గల

ఉత్తమౌజాశ్చ = ఉత్తమౌజస్కుడును

సౌభద్రః = సుభద్ర కుమారుడగు అభిమన్యుడును

ద్రౌపదేయాశ్చ = ద్రౌపది తనయులగు ఉపపాండవులును,

సర్వఏవ = వీరందరును

మహారథాః = మహారథులు.

ఈ సేనలో ధనుర్ధారులైన గొప్ప యోధులు కలరు. వారిలో సాత్యకి, విరాటుడు, మహారథి అయిన ద్రుపదమహారాజు, ధృష్టకేతువు, చేకితానుడు, వీరుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు, పరాక్రమవంతుడైన యుధామన్యుడు, వీరుడైన ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులైన ఉపపాండవులు కలరు. (ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు - వీరయిదుగురు క్రమముగ ధర్మరాజ, భీమార్జున నకుల సహదేవులకు పుట్టినవారు), వీరందరును మహారథులు. శౌర్యమున భీమార్జున సమానులు.

ఇక్కడ దుర్యోధనుడు ఆ మహారథులందరు భీమార్జునులతో సమానమైన పరాక్రమము కలవారు అన్ని చెప్పడాన్ని బట్టి, వారిద్దరూ శూరాగ్రేసరులని, దుర్యోధనునికి భయము పుట్టించేవారని తెలుస్తోంది.

మహారథుడు అంటే పదివేల ధనుర్ధరులగు యోధులతో ఒంటరిగా యుద్ధము చేయగల సమర్థత కలిగినవాడు, ఆయుధశాస్త్రంలో ప్రవీణుడు.

❖❖❖❖❖

శ్రీ గురుభ్యో నమః    శ్రీ మహాగణపతయే నమః    శ్రీ మాత్రే నమః



# బ్రహ్మ శ్రీ డా. సామవేదం షణ్ముఖశర్మ గారి ప్రవచన మహాయజ్ఞము

సిడ్నీ తెలుగు అసోసియేషన్ వారి సౌజన్యంతో

## Date: 4th March - 10th March 2020
## Venue: South Strathfield Public School, 457, Liverpool Road, South Strathfield , Sydney

## సమన్వయ సరస్వతి, బ్రహ్మశ్రీ డా. సామవేదం షణ్ముఖశర్మ గారు

సనాతన ధర్మంలో గురువులు, మహాపురుషులు మరియు శ్రీదత్తాత్రేయ, శ్రీవేంకటేశ్వర, శ్రీఆంజనేయ దేవతా వైభవములతో పాటు శ్రీ కాశీ మాహాత్మ్యము, శ్రీ కాలభైరవ తత్వము వంటి అంశములపై ప్రవచనములు అందించబోతున్నారు

ఈ కార్యక్రమాలకు సకుటుంబ సమేతంగా విచ్చేసి భగవత్కృపకు పాత్రులుకమ్మని కోరుకుంటున్నాము

## CONTRIBUTIONS

**All Days** $116 per family OR $58 per head    **Single Day** $10 per head

**Aditional Sponsorships**

- Fruit Platter for distribution by Sri Guruji after Aaarathi at the end of Pravachanam
- Tea, coffee and cutlery at the venue during the program

Please contact Dr Sundaram Rachakonda-Program convener for additional sponsorships

**Payment Modes**

Bank Transfer: BSB 012 083; A/C 416850535. Bank: ANZ. A/c name: R GOPIKRISHNA
Description: "SS20<your *family name*>" and email receipt to Treasurer

Cheque : Drawn in favour of Gopikrishna Raghavulu
Post to PO BOX 2076, Homebush West, NSW 2140

## THE TEAM

| | |
|---|---|
| **Convener** | Dr Sundaram Rachakonda, 0413019240, rlksumeru@gmail.com |
| **Treasurer** | Sri Gopikrishna Raghavulu, 0411208767, gopikala@hotmail.com |
| **Secretary** | Sri Rajagopal Maddali, 0421808858, rajagopal.m@gmail.com |
| **Venue Volunteer Coordinator** | Sri Sai Gollapudi, 0409907934, gollapudisai@gmail.com |
| **Catering & Food** | Smt Vanaja Khandavalli, 0438088287,vanaja.khandavalli@gmail.com |
| **Contributions** | Smt Laxmi Rachakonda, 0412135099, laxmi_rachakonda@yahoo.com.au |

**Other Sites**

Perth (13-19th Feb 2020) - Sri Murthy Eranki: 0409 377 480
Adelaide (20-25th Feb 2020) - Sri Uday Bhaskar Nidumolu: 0417 755 871
Melbourne (26th Feb -2nd March2020) - Smt Ramani Bommakanti:0435 551 435
Canberra (3rd March 2020) – Smt Sri Sudha Vemuri:0420 979 775
Brisbane (15th -22nd March 2020) - Dr Prasad Challa:0427 634 927

**PLEASE NOTE**

During the program, small children are not allowed inside the hall and parents are not allowed to leave children to play outside the auditorium in view of their safety.
No childcare facilities available at the venue. We regret the inconvenience
Parking: off-street at the venue

Please help us making this event plastic free

# హనుమంతుడు ద్విపద పద్యాలు

శ్రీమతి విజయ చావలి, సిడ్నీ



అంజన సుతునికి ఆంజనేయునికి

అంజలి ఘటియించు అమిత భక్తిగను,

భానుని గురువు గ  భావించి వాయు

సూనుడయ్యెను గద శూరుడు నాడు.

సుగ్రీవ మంత్రిగ సుమధురమ్ముగను

అగ్ర పీఠమునందు అంగదాదులకు

భక్తిగ రాముని బంటుగా నామ

శక్తిని యెల్లెడ సాధించె కనుడు.

సేన కధిపతిగ సేవలో నిల్చు

వాన ర యోధుల వరుసలో మెప్పు

జలధిని లంఘించి జానకి చూసి

బలిమి రాక్షస వీర బలముల కాంచి

లంకను చేరి యా లంకిణి కూల్చి

జంకేమి లేకుండ జయమంటు పలికి

వనముల చీల్చి యా వాన ర బలము

కనిపించు రాక్షస కన్నెర్ర సేయ

శోకించు సీత నశోక వనముల

వో కోతి రూపులో వోదార్చినాడు.

రామ కార్యము చేసి రావణ సభను

రామ భజనలను రంజింప చేసి

హిత వచనములను హెచ్చరికలను

శ్రుతముగ తెల్పిన శూరుడు ఘనుడు

లంకను కాల్చి యా లంకేశు చూసి

వంకంత తిరిగి యా వాటిక కూల్చ

సీతమ్మ కుశలము శ్రీఘ్రము తెల్పి

యాతడు పొందెను యాలింగనమును

శ్రీరామ దూతగా,సీతమ్మ తల్లి

కురిపించు మమత ల కొలువుకు హనుమ

ధైర్యము కీర్తికి దీవించు హనుమ

శౌర్యము దీక్ష కు సాటిగా హనుమ


బలములో గెలుపులో భయములెవ్వేళ

తలపులో మారుతి న్ తలచి న తొలగు.

ద్విపద పద్య లక్షణములు

1. జాతి (ద్విపదలు) రకానికి చెందినది
2. 11 నుండి 15 అక్షరములు ఉండును.
3. 2 పాదములు ఉండును.
4. ప్రాస నియమం కలదు
5. ప్రతి పాదమునందు 3 వ గణము యొక్క మొదటి అక్షరము యతి స్థానము
6. ప్రతి పాదమునందు మూడు ఇంద్ర, ఒక సూర్య గణములుండును.

❖❖❖❖❖


కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె ఊయలలూపు
ఓ కూనలమ్మా !
- ఆరుద్ర
పొదుపుగా
గీతలు వాడటం
ప్రవహించినట్లుండే
ఒరవడి,
సందర్భానికి
తగిన భావం
అన్నిటికంటే మిన్నగా
తెలుగుదనం !
బాపు



## మన తెలుగువారి గీత బాపుగారి జయంతి డిశెంబర్ 15 వ తేదీ సందర్భంగా










# బుడుగు



బాపుగారి కుంచె నుంచి సృష్టింపబడిన మన తెలుగింటి బుడుగు, సీగాన ప్రసూనాంబ

# బాపు చిరస్మర(మ)ణీయులు

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైద్రాబాద్

ఉదయం మెల్లగా స్వర్గద్వారాలు తెరుచుకుంటున్నాయి. పుణ్యకార్యాలు, మంచి పనులు చేసిన ధన్యజీవులందరూ ఒక చోట సమావేశమై, సరదాగా వాళ్ళు చేసిన మంచి సినిమాలు, వాటిలోని హాస్య సన్నివేశాలు రమణగారితో చెప్పుకుని నవ్వుకుంటున్నారు. వాళ్ళతో రమణగారు కూడా మాట్లాడుతూ నవ్వులు పంచుకుంటున్నారు. కాని పైకి ఎంత నవ్వుతున్నా రమణ గారి మనసులో ఏమూలో తీరని బెంగ. ఆ బెంగంతా తన నేస్తం బాపు గారి గురించే. తను లేకుండా బాపు ఎలా ఉన్నారోనని. శ్రీరామరాజ్యం సినిమాకి సంభాషణలు వ్రాయడం పూర్తవగానే తను కొంచెం ఒంట్లో బాగుండక, మిగిలిన భాగం బాపుగారిదే కదా, ఛాయాంకన పర్యవేక్షణ, దర్శకత్వం, మిగిలిన విషయాలు బాపుగారే చూసుకుంటారులే అనుకుని తను వచ్చేసాడు. వచ్చినప్పట్నించి ఆ సినిమా ఎలా వచ్చిందోననే ధ్యాసే. తను వచ్చి మూడు రోజులయింది. (పితృదేవతలకి ఏడాది ఒక రోజు కింద లెక్క). ఆయన ఈ మూడు రోజులూ మూడు యుగాలుగా గడుపుతున్నారు పాపం.

నాగేశ్వరరావుని, అంజలీదేవిని అడిగారు, ' అయ్యా, నాగేశ్వర్రావుగారూ! మీరూ అంజలీదేవిగారూ వచ్చి ఒక పూట పైనే అయింది కదా! శ్రీరామరాజ్యం సినిమా ఎలా వుంది?'

' మీరేం బెంగపడకండి రమణగారూ. మనసులో మీరు లేరన్న దిగులున్నా బాపుగారు శ్రీరామరాజ్యం సినిమా చాలా అద్భుతంగా తీసారు. అందరూ బాగా ఆదరించారు. అందులో వాల్మీకి పాత్ర నేనే వేసాను. సీతని అద్భుతంగా తీర్చిదిద్దారు.'

ఇంతలో అందరూ హడావిడిగా పరుగులెడుతున్నారు. లోపలికి వచ్చేవాళ్ళు వస్తున్నారు. వాళ్ళందరూ చాలా అందమైన అమ్మాయిలు. వాళ్ళ నడుములు చాలా సన్నగా తీగల్లా వున్నాయి. పెద్ద కలువరేకుల్లాంటి కాటుక తీర్చిన కళ్ళు, నుదుట సిందూరం బొట్లు, నవ్వితే విరజాజుల్లా విచ్చుకునే చిన్ని నోళ్ళు, చివర జడకుప్పెలతో నల్లత్రాచుల వలె వున్న పొడవాటి జడలు, మరీ పొడవుగా వుండడం వల్లనేమో, కొంతమంది ఆ నల్లత్రాచుల్ని కొంతమంది మెడలకి, కొంతమంది చేతులకి చుట్టుకుని, చీరల సింగారాలతో, మువ్వల సవ్వడులు చేస్తూ, కలహంస నడకలతో వస్తూంటే, ఎవరా ఈ అందాల బొమ్మలు అనుకుంటూ చాటుగా నించుని రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలు కూడా విస్తుపోతూ, కించిత్ అసూయతో చూస్తున్నారు.

ఆ అందాలబొమ్మల గురించి సృష్టికర్త బ్రహ్మకి కూడా పాలుపోలేదు. తనకి తెలిసి ఇన్ని వేల అందాల బొమ్మలు తను గీసిన బొమ్మలు కావు. మరి ఈ సృష్టి చేసిన విధాత ఎవరు అని ఆలోచిస్తున్నాడు.

ఈలోగా పూలపల్లకి వెడుతోంది. దారి పొడవునా పూలు జల్లుతున్నారు. ఎర్రతివాచి పరిచి స్వాగతం పలుకుతున్నారు. ఆ పల్లకి లోంచి ఒకాయన దిగుతుంటే, ఆయన్ని చేతులు పట్టుకుని దేవతలందరూ సాదరంగా లోనికి తీసికెడుతున్నారు. అందరితో ఇంత గొప్పగా రాచమర్యాదలు చేయించుకునే ఆ మహానుభావుడెవరై వుంటారా అని చూస్తున్నారు. ఇంకా ఆయనెవరో సినిమా కెమెరా, రంగు పెనిసిళ్ళు, పెన్నులు, పెయింటింగ్ బ్రష్షులు మోసుకుంటూ వచ్చాడు.

' రామలింగయ్యా! ఆయన ఎవరూ?' అడిగారంతా.

బాపుగారయ్యా, బాపుగారు! మన బాపుగారు!'

' ఓహో! ఈ వచ్చిన అందాలబొమ్మలందరూ బాపు బొమ్మలన్నమాట!'

అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా అరుస్తున్నారు, ' బాపుగారొచ్చారు, బాపుగారొచ్చారు!' అంటూ.

బాపుగార్ని చూడగానే గమ్మున రమణగారు వచ్చి ఆలింగనం చేసుకున్నారు. ఆయన దగ్గర వున్న ఆండ్రాయిడ్ టేబ్లెట్ జేబులోంచి తీసిచ్చారు బాపుగారు. ' శ్రీరామరాజ్యం ' విడియో ఇందులో వుంది. జాగ్రత్తగా వుంచు. తరవాత చూద్దుగాని.'

ఇంతలో సింహద్వారం వద్ద ఎవరితోనో పెద్ద గొడవ జరుగుతోంది. ఇద్దరు చిన్న పిల్లలని లోనికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు అటు ఇటు వున్న ద్వారపాలకులు.

' వీల్లేదు. మీరు బాగా చిన్నపిల్లలు. అందుకని మీరు లోనికి రాకూడదు.'

' అసలు మేం ఎవరో తెలుసా? తెలిస్తే ఇలా మాటాడరు. హోలాంధ్రా అంతా తెలుసు మేం ఎవరో. మేం చిన్నపిల్లలం అంటావేంటి? మేం పుట్టి చాలా ఏళ్ళు అయింది. ఓ అరవై ఏళ్ళో, నలభయి ఏళ్ళో, డెభ్భయి ఏళ్ళో అయుంటుంది. మాకు లెక్క సరిగా తెలీదు. బాపు రమణల గీత రాతల్లో పుట్టిన మేం చిరంజీవులం.'

' మరింత చిన్నగా వున్నారేం? నీ పక్క ఈ పిల్లెవరు?'

' ఏయ్, పిల్లంటావేంటి? మాటలు మరియాదగా రానీ. ఇది నా ఫ్రెండ్ సీగాన పెసూనాంబ. మేం ఎన్నేళ్ళయినా చిన్నగానే వుంటాం.'

' అంటే ఏం తినరా? మీ అమ్మ మీకేం పెట్టదా పాపం?'

' ఏయ్, జాటర్ డమాల్! మా అమ్మనేం అనకు. మా అమ్మ చాలా మంచిది. కాని ఒక్కోసారి చాలా ఇబ్బందులు పెడుతుంది. అది నాకు నచ్చదు. నేను ఏడుస్తున్నా వినకుండా ఘట్టిగా పట్టేసుకుని స్నానం చేయిస్తుంది. నాకు నచ్చలేదని చెప్పినా వినకుండా తనకిష్టమైన బట్టల్లో కూరుతుంది. ఆఖలి లేదు తల్లో అన్నా వినకుండా, బలం, బలం అంటూ పేద్ద గ్లాసుడు బోర్నవిటా బలవంతంగా తాగిస్తుంది. నాకు కడుపునొప్పిగా వుంది, స్కూలుకెళ్ళనంటే, డాక్టర్ని పిలిచి ఇంజక్షను చేయిస్తానంటుంది. అప్పుడు గమ్మున కడుపు నొప్పి తగ్గిపోయిందంటా. అప్పుడు మా గోపాళం బాబాయొచ్చి నన్ను రక్షించి షాపింగ్ కి తీసికెళ్ళి, చాక్లెట్లు కొనిస్తానని చెప్పి స్కూలులో వదిలేస్తాడు. అప్పుడు వాడి మీద చాలా ఖోపం వచ్చేస్తుంది. పోనీ, పలక పగిలి పోయింది, స్కూలుకెళ్ళను అంటే కిరాణాకొట్టు విసినాదాన్నడిగి ఇంకో పలక కొనిస్తాడు. బళ్ళో మాస్టారేమో అ ఆ లు సరిగ్గా రాయలేదని పెద్ద బెత్తంతో కొడతాడు. ఇలా ఎన్నని చెప్పను నా కష్టాలు? చిన్నపిల్లలంటే అస్సలు గౌరవం లేదు పెద్దాళ్ళకి. అందుకే వచ్చేసాం. మరి బాపుతాతగారిని మీ దగ్గిరకి లాక్కొచ్చారుగా? అందుకే నా కష్టాలన్నీ చెప్పుకోడానికి బాపుతాత గారికి తెలీకుండా వెనకాలే వచ్చేసాం.'

' మీ పేర్లేంటి?'

' హయ్యో! ఇంత చెప్పినా మా పేర్లు తెలీలేదా? రామాయణం అంతా విని రాముడికి సీతేమవుతుంది అన్నాట్ట

వెనకటికెవరో.  నా పేరు బుడుగు.  రమణగారు రాసిన బుడుగు నవల్లో హీరోని నేనే.  ఇది సీగానపెసూనాంబ, నా ఫ్రెండు.  మేమంటే బాపుతాతగారికి చాలా ఇష్టం.  మేం లేకపోతే బెంగెట్టుకుంటారు.  మమ్మల్ని పోనీ.'

' కుదర్దంటే కుదర్దు.'

' ఎందుక్కూ?'

' రారా బుడుగూ, వీడో జాటర్ డమాల్.  అదిగో, వీడి వెనకాల పెద్ద భూతం వస్తోందిగా, అప్పుడు వీడ్ని ఘాట్టిగా పట్టేసుకుంటుందిగా?  అప్పుడు వెడదాం.'

భూతం ఎవరా అని వెనక్కి చూసేంతలో సీగానపెసూనాంబ, బుడుగు బుడుంగున లోపలికి ఓ గెంతు గెంతారు.  పరిగెట్టుకుంటూ గమ్మున బాపుగారి దగ్గరికి వెళ్ళారు.

' మీరెందుకొచ్చార్రా బుడుగూ?'

' అమ్మ నలుగు పెట్టి తలంటి పోస్తానని నన్ను ఎత్తుకు తీసికెడుతుంటే, నా కొద్దు బాబోయ్ తలంటు అని ఘోరిగా విడిపించుకుని కిందకి దిగి పరెగెట్టాను.  నా వెంట అమ్మా పరిగెట్టింది.  నేనింకా ఘాట్టిగా పరిగెట్టాను.  అలా పరిగెట్టుకుంటూ, పరిగెట్టుకుంటూ, పరిగెట్టుకుంటూ.....కుంటూ, మధ్యలో సీగానపెసూనాంబని లాక్కొచ్చి, ఇద్దరం మీ వెనకాతలే వచ్చేసాం.  మేం మీతోనే వుంటాం.'

ఇంతలో బాపు గీసిన అందమైన అమ్మాయిలందరూ, ' అవును బాపూ!  మేమూ మీతోనే వుంటాం.  ఇంకా భూలోకంలో వుంటే, మీరు వేసిన ఈ పొడవాటి జడలు ఫేషనంటూ కత్తిరించేస్తారు.  నుదుట బొట్టు తీసేస్తారు.  ఛీ, చీర బాలేదంటూ, ఫేషను  పేరుతో పీలికల డ్రస్సులేస్తారు.  పాపిడి లేకపోయినా, చిన్న హుక్కున్న పాపిడిబిళ్ళ తగిలిస్తారు.  రెందుచేతులున్నా, ఒక చెయ్యే కుట్టించి, ఇంకో వైపు బుజం కిందగా వచ్చి, అటు ఇటు చిల్లులున్న డ్రస్సులేవో వేయిస్తారు.  కాళ్లకి, నడవలేమన్నా వినకుండా హైహీల్సు వేస్తారు.  ఆ కత్తిరించిన జుట్టుకి టింకర వంకర టింకర వంకర పాపిడి తీసి మా రూపాలు మార్చేస్తారు.  లేకపోతే జుట్లు విరబోయించి వుంచుతారు.  తలుచుకుంటేనే భయమేస్తోంది.  టి.వి. ఛానెళ్ళలో యాంకరమ్మల్లాగా, హీరోయిన్ల లాగా మా అందమైన రూపాలు వికృతంగా ఉండకూడదనే మేమూ వచ్చేసాం.  ఇవిగో, మీ బ్రష్షులు, కుంచెలు, కాగితాలు ఇక్కడికి తెప్పించాం.  ఇక్కడే మీరు బొమ్మలెయ్యండి.  మీరు మమ్మల్ని ఎంతో అందంగా, సంప్రదాయ బద్ధంగా తీర్చి దిద్దారు.  మరి అమ్మాయిలందరూ అలా ఎందుకుండరు?  మన సంప్రదాయాన్ని విడిచిపెట్టి ఎందుకంత వికృతంగా తయారవుతున్నారు?'

' అమ్మాయిలూ!  మనం ఒకళ్ళని నిందించకూడదు.  కాలానుగుణంగా, కాలప్రవాహంలో అనేకానేకం జరుగుతూ వుంటాయి.  కాలచక్రం ఆగదు.  ఆ కాలచక్ర భ్రమణంలో మళ్ళీ పాత సంప్రదాయాలు వస్తాయని ఆశిద్దాం.'

ఇంతలో బాపుగీతల్లోని ' శ్రీరామ పట్టాభిషేకం ' లోని వారంతా వచ్చి, ' శ్రీరామరాజ్యం ' త్వరగా చూపించు నాయనా, చూడాలనుంది.' అన్నారు.

❖❖❖❖❖

# తెలుగు బడి పిల్లలు

డా. ఉషా శ్రీదేవి కరుణాకర్, సిడ్నీ

చిన్నారుల ఆనందపు కిలకిలరవళి కంటికి దివ్య దీపావళి
పొన్నారుల చిరు సరదాల వరద ఇంటికి ఆశ్వయుజపు దసరా
దోగాడి పరుగెత్తి చెలరేగితే ఉజ్వలమగు ఉగాది
శుభతేజమున వెలుగు వారి నయన కాంతులే శోభన సంక్రాంతి
కళ్ళ ముందు వెలిగే దివ్య తారకలగు బాలబాలికల ఆటలని వీక్షిద్దాం
ఆ ముద్దుముచ్చట్ల మురిపాలు మన కనుపాపల్లో బంధిద్దాం!!




❖❖❖❖❖

సిడ్నీ తెలుగు అసోసియేషన్ దీపావళి సంబరాలు




తెలుగు అసోసియేషన్
సిడ్నీ ఆస్ట్రేలియా






తెలుగు అసోసియేషన్
సిడ్నీ ఆస్ట్రేలియా

# YOUNGBOOKS.COM.AU

## Kids Books

**Telugu, science, maths, activities, logical reasoning, colouring, stories etc.**










use code 'TELUGUVAHINI'
during checkout to avail
**30% discount**

We deliver all over Australia at discounted price

# గానగంధర్వుడు శ్రీ ఘంటసాల వేంకటేశ్వర రావు

శ్రీమతి షామీరు జానకీ దేవి, హైదరాబాదు



గంధర్వాంశ సంభూతులకు ఇటువంటి సంపద లభిస్తుంది. కవి, సంగీత దర్శకుడు కలసి పనిచేసినప్పుడు చక్కటి పాటగా రూపాంతరమవుతుందని ఘంటసాల గారి నమ్మకము... తృప్తిగా బాగా కుదిరే వరకు ఆయనకు విశ్రాంతి ఉండదు... గళం లో గాంభీర్యం, స్వరంలో మాధుర్యం, పలుకులో సౌందర్యం, అందులో స్పష్టమైన ఉచ్చారణ.. త్రిగుణాత్మక సమ్మేళనం... నవరసాలను అద్భుతంగా పలికించగలిగిన ఏకైక గాయకుడు మన ఘంటసాల గారు... మన అని చెప్పుకోవడం లో ఎంతో ఆనందం, ఆత్మీయత, గర్వం ఉంటుంది కదూ...

మన ఘంటసాల గారు, మన తెలుగువారి ముద్దు బిడ్డ కావటం మనం గర్వించతగిన విషయం. తెలుగు చలనచిత్ర చరిత్రలో ఉత్తమ సంగీత దర్శకులుగా అందరి మదిలో నిలచిన కొద్దిమందిలో ఘంటసాలగారు ఉన్నారంటే, సంగీతంపై వారికున్న సాధికారత, నిర్విరామ కృషి అందుకు కారణం... అలాంటి మధురస్వరం ఆయనకు దైవదత్తం కావచ్చు... కానీ కఠోర శ్రమ, సాధన వారి ఆయుధం... కష్టేఫలి అనే నినాదం తో ముందుకు సాగిన శ్రమజీవి శ్రీ ఘంటసాల గారు... ఘంటసాల గారు పాట పాడితె భావప్రకటన తన గళం లో ప్రతిబింప చేస్తారు.. దానితో నటుడి పని చాలా తేలిక... సగం భావాన్ని పాటలోనే చొప్పించగలరు... నవరసాలను తన స్వరం లో పలికించే నేర్పు ఘంటసాల గారికి ఉంది...

అన్ని రంగాలలో ఎంతోమంది నిష్ణాతులు ఉన్నారు... కానీ తాను నమ్ముకున్న సినీరంగానికి తానే ఒక ప్రతీతిగా నిలబడే అదృష్టం ఒక్క ఘంటసాలగారికే స్వంతం... "ఘంటసాల కాదు కంఠసాల" అన్నారు కొందరు... భావోద్వేగాన్ని వ్యక్తపరిచే భాష సంగీతం.. Music is the Language of emotion. హృదయాన్ని స్పందింపచేయడం కళ యొక్క ప్రయోజనం....

భావోద్వేగాన్ని కలుగచేసి, కంఠనాదం లో పలికే స్వర సముదాయాల కలయిక మాత్రమే సంగీతం. చెరకు ఎక్కడ విరిచితిన్నా తియ్యగానే ఉంటుంది... అలాగే ఘంటసాలగారు ఏ పాట పాడినా తేనెలొలుకుతూ ఉంటుంది. ఆయన పాటను మామూలు పాటలాగా పాడరు... కవి మనసులో ఏమనుకుని ఆ గీత రచన చేసాడో, ఆ భావాన్ని చక్కటి ఉచ్చారణతో, శబ్ద సౌందర్యాన్ని, లలితమయిన భావాన్ని పోషించి పంచుతారు... ఆ భావనలో తాదాత్మకత చెంది, మునిగిపోతూ జీవిస్తారు... మనల్ని ఆనందసాగరంలో తేలియాడేలా చేస్తారు. విచారసాగరం లో ముంచేలా చేస్తారు... ఏ పాటకు ఎక్కడ ఎటువంటి భావాన్ని చూపించాలో ఆయనకు తెలిసినట్లుగా మరొకరికి తెలియదు... పాలసముద్ర మధనంలో లభించిన అమృతాన్ని దేవతలు సేవించి సకల భోగాలు అనుభవిస్తూ సుఖసంతోషాలని పొందుతున్న సమయంలో మన ఘంటసాలగారి లాగా ఎప్పుడూ ఎదుటివారి గురించి ఆలోచించే ఒక గంధర్వుడు దేవేంద్రుడు దగ్గరికి వెళ్ళి తన మనసులో మాట ఇలా చెప్పాడు... "భూలోకంలో ఎన్నో కష్టాలు పడుతున్న మానవులు అన్నీ తట్టుకుని, ఆనందంగా ముందుకు పోవాలనుకుంటే వారికి కూడా ఇలాంటి అద్వితీయమైన సుఖాలలో ఒక్కటైనా ప్రసాదించు ప్రభు" అని వేడుకున్నాడు... "గంధర్వా! నీ దయాగుణానికి సంతసించాను... నీ ద్వారానే నీ కోరిక నెరవేరుస్తాను... నువ్వు భూలోకంలో 1922 డిసెంబర్ 4 వ తారీఖున కృష్ణా జిల్లాలో చౌటుపల్లి గ్రామం లో ఘంటసాల గా జన్మించి నీ గానామృతంతో ప్రజలకు అనందం కలుగజేయి", అంటూ దేవేంద్రుడు పంపిన గాన గంధర్వుడు మన ఘంటసాల గారు... ఆయన పాడని పాట లేదు... ఆయనికి తెలియని రాగం లేదు... సంగీతంలో జన్మించి అందులోనే ఎన్నో శిఖరాలను అధిరోహించి, తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయి మన హృదయాలలో కొలువున్న చిరస్మరణీయుడు... ఘంటసాలగారి పాటలు పాడుకుంటూ ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు... అర్ధ శతాబ్దం గడిచినా ఆయన పాటల విలువ ఇంకా పెరుగుతున్నది...

ఒకసారి ఘంటసాలగారి ఆరోగ్యం బాగాలేక వేరే గాయకుని చేత పాడించి ట్రాక్ తీసుకున్నారు... తదనంతరం ఘంటసాలగారి ఆరోగ్యం బాగైయ్యాక ఆయనతో పాడించవచ్చని సంగీత దర్శకుడు అనుకున్నారట... ఆ పాట పాడడానికి వచ్చిన ఘంటసాల గారు ఆ పాట విని, సదరు గాయకుడు బాగా పాడాడు, అదే ఉంచేయండి, అని మెచ్చుకుని, దర్శక, నిర్మాతలకు నచ్చచెప్పి వెళ్ళారట...

ప్రముఖ నటులు, గాయకులు శ్రీ చిత్తూరు నాగయ్య గారు ఘంటసాల గారి గురించి ఇలా అన్నారు "కొందరు గాయకులు తమ కంఠాన్ని శ్రుతిలో మేళవించడానికి ప్రయత్నిస్తారు... కాని శ్రీ ఘంటసాలగారి గాత్రం లోనే శ్రుతి పలుకుతూ ఉంటుంది.."

అదే రోజుల్లో మంచిగా పాడి రికార్డ్ చేసిన పాటలు తీయించిన గాయకులు ఉన్నారు. చూడండి ఎంత వత్యాసమో... అందుకే ఆ మహానుభావుడు చిరకాలం అందరి మదిలో దీపమై వెలుగుతున్నారు.. పాటల పోటీల్లో నేడు చిన్న పిల్లలు సైతం వారి పాటలే పాడడానికి ఇష్టపడుతున్నారు... ఆచార్య ఆత్రేయగారు చెప్పినట్లు ఘంటసాలగారు పాడిన పాటలు, ప్రపంచంలో శబ్దం

ఉన్నంతవరకు, వినిపిస్తూనే ఉంటాయి... ఆ మంచితనం, ఆ వినయం, ఆయనను ఎరిగున్న వాళ్ళందరికి అనునిత్యం కనిపిస్తూంటాయి... వంశీ రామరాజు గారు ఘంటసాల గారి ఆరాధనోత్సవాలని 2010లో త్యాగరాయగాన సభలో 51 రోజులు నిర్విరామంగా నిర్వహించారు... ఆ సభలో శ్రీ అక్కినేనిగారు తన మాటల్లో ఇలా అన్నారు.."నటుడు కేవలం తన నటనతోనే కలకాలం ప్రజల మదిలో ఉండడు, గాయకులు పాడిన మంచి పాటలతో స్థిరంగా ఉంటాడు... అలా ఘంటసాలగారి పాటలు వింటుంటే మీరు వద్దనుకున్నా కూడా నాగేశ్వరరావు మొహం మీ హృదయఫలకంపై ఉండవలసిందే... ఒక చనిపోయిన వ్యక్తిని బ్రతికి ఉన్న వ్యక్తిలాగా తయారుజేసి, దానికి దైవత్వాన్ని సృష్టించి, అద్భుతమైన ప్రక్రియగా మలచి ప్రపంచంలో ఇంకెవ్వరూ చెయ్యని విధంగా వంశీ రామరాజుగారు హైద్రాబాదులోని హయ్యత్ నగర్, కుంట్లూరు గ్రామంలో ఘంటసాలగారికి గుడి కట్టించారు. ఘంటసాలగారి అభిమానిగా ఈ రోజుకీ ఆయన పాట వినందే నిద్రపోని నా మనసు, ఘంటసాలగారి జయంతి డిశెంబర్ 4 వ తేదీ సందర్భంగా అందిస్తున్న అక్షర నివాళి...

ఘంటసాల గారు పాడిన మధురమైన పాట ఈ లింకు ద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=ruTfmRjnbS4

❖❖❖❖❖




❖❖❖❖❖

**గడచిన 2019 వ సంవత్సరానికి వీడ్కోలు చెబుదాం, రాబోయే2020 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం**

# వాహిని పాఠకుల స్పందన

కళలను ప్రోత్సహించాలనే వాహిని వారి సంపాదకీయం ప్రేరణ కలిగిస్తున్నది.. వృత్తిలో పాట ఒక వ్యాపకంగా ఉండాలి అనే సూచన బాగుంది. అందరిలో కళాతృష్ణను బయటకు తీసే వాహిని చదవటం పాఠకుల అదృష్టం. శ్రీ పెయ్యేటి రంగారావుగారి భగవద్గీత ఎన్నో నూతన విషయాలను తెలియజేస్తున్నది. కర్ణుడు మంచివాడైనా చెడ్డవారి సాంగత్యం ఎలా ఓడిపోయేలా చేసిందో వివరించిన విధానం బాగుంది. వివిధ మతాల మధ్య భేదాలను గౌరవించండి, కానీ ఐక్యత అనే జ్యోతిని ఆరిపోనీయవద్దు. బాబాగారి పలుకులు అందరూ ఆచరిస్తే బాగు. శ్రీమతి పెయ్యేటి శ్రీదేవిగారి 'పాడుతా తీయగా' చదువుతుంటే భవానీ కోరిక తీర్చుకున్న విధానం బావుంది. కలలు కనండి. అవి తీరేవరకు శ్రమించండి అనే నానుడిని ఆదర్శంగా పెట్టుకుని తన కల అలా నెరవేర్చుకుంది భవాని.  శ్రీమతి డి. కామేశ్వరి గారి 'హారతి పళ్ళెం' ఒక చక్కటి సందేశాన్నిచ్చింది.  భగవంతుడు తాను అవసరమైనప్పుడు వస్తానని రుజువు చేసినట్లుగా ఉంది. శ్రీమతి విజయగారి 'గమ్యం' నేటి పిల్లలు తమ గమ్యాన్నిఎలా నిర్దేశించుకోవాలో కథకు అంసంధానం చేస్తూ బాగా చెప్పారు. శ్రీ వంగూరి చిట్టెం రాజుగారి 'అమెరిక్వీన్ విక్టోరియా బర్త్ డే బహుమతి' బావుంది. బాబాలపై చిట్టెం రాజు గారు సంధించిన అస్త్రం వాడిగా, హాయిగా నవ్వించింది. 'అర్థ-నారి' ఎలా అర్థాన్ని అందిస్తుందో వివరించిన శ్రీ ఆలూరి పార్థసారథిగారి కథ బావుంది. అఖరుగా 'మా నేపాల్ యాత్ర' ప్రచురించినందుకు వాహినికి నా కృతజ్ఞతలు..

శ్రీమతి జానకీదేవి వనం, హైద్రాబాద్

గమ్యం కథలో పిల్లల్ని మోటివేట్ చెయ్యడానికి బామ్మగారు కథలు చెప్పే సందర్భాన్ని వినియోగించుకోవడం పాత్రోచితంగా ఉంది. అంతేకాక పెద్దవాళ్ళకి ఆదర్శప్రాయంగా ఉంది.  విజయ గొల్లపూడి గార్కి అభినందనలు.
ఇక వంగూరి వారి క్వీన్, చిలకమర్తి గారి హాస్యాన్ని గుర్తు చేసిందంటే అతిశయోక్తి కాదు. రెండు కథలూ బాగున్నాయి.

శ్రీ ఆలూరి పార్థసారథి చెన్నై/సిడ్నీ.

❖❖❖❖❖




RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing
OPEN 7 DAYS

New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

# ఆమె వెర్సస్ దేముడు

రచన: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్

ఒక దంపతులకి ఆడపిల్ల (ఛీ, ఛీ) పుట్టింది.

తల్లి మనసులో బాధ పడింది. ' అమ్మా లలితాదేవీ! రోజూ లలితాసహస్రం చదివానే? నాకు పండంటి మగబిడ్డని ప్రసాదించమని వేడుకున్నానే? శరన్నవరాత్రులలో నాకీ ఆడబిడ్డని ప్రసాదించావా తల్లీ?

'అయ్యో భక్తురాలా! రోజూ నీ పూజలందుకున్న నేను కూడా అమ్మనే కాని అయ్యని కాదు కదమ్మా? మరి నీ పూజలందుకోడానికి నేనెల్లా పనికి వచ్చానమ్మా?' అని ఆ లలితాదేవి నవ్వుకుంది.

ఆ పాపకి నాలుగేళ్ళు వచ్చాయి. చాలా బొద్దుగా ముద్దబంతిపువ్వులా తయారయింది.

తండ్రి అంటున్నాడు, 'ఏమె మన లలితకి కొంచెం అన్నం తక్కువ పెడుతూ వుండు. ఆడపిల్ల లావుగా ఉంటే భవిష్యత్తులో చాలా సమస్యలొస్తాయి. పెళ్ళి కూడా కాదు.'

'నేనేమి చెయ్యనండీ? దాని శరీరతత్వం అలాంటిది.'

ఓ రోజు సాయంత్రం ఆ లేత అరిటాకు ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. 'అమ్మా! మేమందరం దాగుడుమూత లాడుకుంటున్నామమ్మా! నేను ఔటవక పోయినా ఔటయ్యానని, నేను దొంగనని అంటూ పక్కింటి ముల్లుగాడు నా బుగ్గలు గట్టిగా గిల్లేసాడమ్మా.'

తల్లి సరళ అంది, 'ఇదుగో లలితా, రేపటి నించి నువ్వు బయటికెళ్ళి ఆటలాడడం మానెయ్యి. ఇంట్లోనే కూర్చుని బుద్ధిగా చదువుకో.'

ఆ రోజు నించి లలితకు ఆటపాటలు బంద్!

లలిత పెరిగి పెద్దదయింది. ఇంటరు చదువుతోంది. ప్రతి క్లాసులోను ఫస్ట్ మార్కులు ఆమెకే. ఆమె తెలివి తేటలకు టీచర్లు కూడా అబ్బురపడే వారు.

ఒకరోజు ఆ అరిటాకు కాలేజి నుంచి ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది.

'అమ్మా, ఇవాళ కాలేజిలో ముళ్ళకంప నా వెనకాల పడి నన్నేడిపించారమ్మా. ఒక ముల్లు నా జడ పట్టుకుని లాగాడమ్మా. నేను లెక్చరర్ ముల్లుకి కంప్లైంట్ ఇచ్చానమ్మా. వాడు కూడా మరి నువ్వు అంత అందంగా ఎందుకున్నావని కిసుక్కున నవ్వాడమ్మా. క్లాసులో ఉన్న ముళ్ళన్నీ వెకిలిగా నవ్వారమ్మా.'

తండ్రి మధుబాబు అన్నాడు, 'ఇదుగో లలితా! ఇంతవరకూ నువ్వు చదివిన చదువు చాలులే. రేపటి నించీ కాలేజీకి వెళ్ళకు.'

ఆ విధంగా లలిత చదువు ఆగిపోయింది.

లలితకి పెళ్ళి నిశ్చయమయింది. అందరూ ఆమెని తెగ పొగిడేసారు. 'అదృష్టవంతురాలివే. కాలేజి లెక్చరరు నీకు మొగుడవుతున్నాడు. ఇంకనించీ నువ్వు కార్లలోనే తిరుగుతావు.'

ఒక ఏడాది లలిత వైవాహిక జీవితం బాగానే గడిచింది. ఆమెకు పండంటి ఆడుబిడ్డ కలిగింది. భర్త సుధీర్, అత్త మామలు తిట్టిపోసారు.

అరిటాకు అన్నీ సహించింది. రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు పిడుగు పడింది. కాలేజిలో సుధీర్ ఒక విద్యార్థిని పైన అత్యాచారం చేసాడట. విద్యార్థులందరూ అతడ్ని చితకబాది

పోలీసుల కప్పగించారు.

మామగారు బెయిలిప్పించి ఇంటికి తీసుకు వచ్చారు.

కాని సుధీర్ ఆ అవమానాన్ని భరించలేక పోయాడు. తన నేరం రుజువవుతుందని తెలుసు. అప్పుడు తను జీవితాంతం జైల్లోనే మగ్గిపోవాలి అని భయపడ్డాడు. ఒక రాత్రివేళ ఉరి పోసుకుని తనువు చాలించాడు.

అప్పుడు అరిటాకు తన సహజత్వాన్ని వదిలేసింది.

అత్తమామల నెదిరించింది. ప్రైవేటుగా బి.ఏ.కి కట్టి పాసయింది. కాలేజిలో చేరి ఎమ్. ఏ. పాసయింది. పి.హెచ్ డి. చేసింది. అదే కాలేజిలో లెక్చరర్‌గా చేరింది.

ఒకరోజు తోటి లెక్చరర్ అరవింద్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. కాని ఆ అరిటాకు చీలిపోలేదు. ముల్లు చెంప ఎడాపెడా అందరి ఎదురుగా వాయించేసింది. ఆ ముల్లు సిగ్గుతో విరిగిపోయింది.

ఆమె తన కూతురు శిరీష ను స్కూల్లో చేర్చింది.

ఒకరోజు ఆ లేత అరిటాకు ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. 'అమ్మా, స్కూల్లో మగపిల్లలు నన్ను ఏడిపిస్తున్నారమ్మా. నేనింక స్కూలుకెళ్ళనమ్మా.' అంటూ ఏడ్చేసింది.

లలిత ఆమెను దగ్గర కూర్చోపెట్టుకుని హితబోధ చేసింది. 'అమ్మా! నువ్వు సున్నితంగా అరిటాకులా ఉండవద్దు. కంచుముక్కలా దృఢంగా వుండు. నిన్ను ఏ ముల్లు ఢీకొన్నా నీకేమీ కాకూడదు. కాని ఆ ముల్లే విరిగిపోవాలి.'

శిరీషలో ఆత్మస్థైర్యం పెరిగింది. దీక్షగా చదువుకో సాగింది.

చదువు పూర్తయింది. ఆమెకు ఇస్రోలో ఉద్యోగం వచ్చింది.

అంచెలంచెలుగా ఎదిగింది. ఇస్రో డైరెక్టర్ అయింది. కుజగ్రహానికి మనిషిని పంపి చరిత్ర సృష్టించింది. ఆమెను 'భారతరత్న' వరించింది.

ఐనా లలితకు ఆమె పసిపాపాయే. రోజు పొద్దున్నే ముందుగా తల్లి పాదాలకి నమస్కరించుకుంటుంది.

ఎందుకు నమస్కరించుకోదూ మరి? లలిత ఇప్పుడు 'భారతరత్న' కు తల్లి కదా మరి!!

❖❖❖❖❖



# మనోనిబ్బరం

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ

కరుణ మనసు పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది. తను వున్న పరిస్థితి తలుచుకుంటే అగమ్యగోచరంగా అనిపించింది. డాక్టర్ దగ్గిర్నించి ఫోన్ వస్తే వర్క్ నించి త్వరగా బైటపడింది. రెండురోజుల క్రితమే డాక్టర్ రాసిచ్చిన బ్లడ్ టెస్ట్ లన్నీ చేయించింది. ఒక ప్రక్క మనసులో ఏదో తెలియని భయం. డాక్టరు ఎందుకు రమ్మన్నట్టు? బ్లడ్ టెస్ట్ రిజల్ట్స్ లో ఏద్దైనా లోపముందా? తనకి తెలియకుండానే మనసులో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఊహు....నా మనసులో వీలైనంత వరకు నెగెటివ్ ఆలోచనలు రాకుండా తరిమికొట్టాలి. ముందు డాక్టరు ఏమంటారో చూసి తరువాత ఒక నిర్ణయం తీసుకోవాలి. ఫలితం ఏది వచ్చినా గాని నేను మాత్రం మనోనిబ్బరంగా వుండాలి అనుకుంటూ మొబైల్ లో తనకి నచ్చిన సంగీతం బ్లూటూత్ హెడ్ ఫోన్స్ చెవులో పెట్టుకుని వింటూ హాస్పిటల్ కి చేరుకుంది. రిసెప్షన్ లో తన వివరాలు ఇచ్చింది. డాక్టర్ పిలుపు కోసం నిరీక్షిస్తూ అక్కడ ఉన్న హెల్త్ మ్యాగజైన్ పేజీలు తిప్పసాగింది. ఇంతలో డాక్టరు పిలిచారు.

'కరుణా! ఎలా వున్నారు? ఏమ్మా, మీతో ఎవరైనా వచ్చారా?'

'లేదండీ. మీ నుంచి ఫోను రాగానే వర్క్ నించి బయలుదేరి ఇలా వచ్చాను. ఐనా మా వారు వర్క్ లో ఆడిట్ తో బిజీగా వున్నారు. మీరు చెప్పండి డాక్టర్! ఏం చెప్పినా తట్టుకునే ధైర్యం నాలో వుంది.'

'కరుణా! మీ బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ లు అన్నీ వచ్చాయి. కొన్ని టెస్ట్ లకు పాజిటివ్ రిజల్ట్ వచ్చింది.'

మనసులో కరుణ అనుకుంది, 'ఏమిటో! నా మనసు. నేను పాజిటివ్ ఆలోచనలతో నింపుకోవాలని అనుకుంటాను. టి.వి.లో ఏ అఘాయిత్యాలు చూసినా మనసు మళ్ళించుకుని, నా దేశం ఎంతో సుభిక్షంగా ఉంది, ఉంటుంది, ఉండబోతుంది అనుకుంటాను. కాని ఆ పాజిటివ్ సెస్ బ్లడ్ టెస్ట్ రిజల్ట్ విషయంలో ఉండకూడదని పాపం! నా పిచ్చి మనసుకి తెలియదు. అవును మరి! బ్లడ్ రిజల్ట్స్ ఎపుడూ నెగెటివ్ వస్తేనే హమ్మయ్య, ఫరవాలేదు, నాకే రోగమూ లేదు అనుకుని తృప్తి పడతాను. ఇక్కడ శరీరంలో భాగాలన్నిటికీ టెస్ట్ లకి వేలకి వేలు కుమ్మరించినా ఫరవాలేదు గాని, రిజల్ట్ మాత్రం నెగెటివ్ ఉండాలి. చిన్నప్పుడు తను లక్షలు కుమ్మరించి కోచింగ్ లకి వెళ్ళి, పరీక్షలో మంచి ఫలితాలతో నెగ్గుకుంటూ జీవితాన్ని ఇంతవరకూ నెట్టుకుంటూ వచ్చింది. చూద్దాం, ఇప్పుడు డాక్టరేం చెబుతారో? '

'కరుణా! మీరు నేను చెప్పే విషయాన్ని మనసు దిటవు చేసుకుని వినటానికి సిద్ధంగా వున్నారా? లేదంటే మీ ఆప్తమిత్రుడు లేదా బంధువు ఎవరైనా ఉంటే వారితో మాట్లాడతాను.'

కరుణ ఒకపక్క మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా, మనసులో మళ్ళీ అనుమానాల తుంపరలు. డాక్టర్ ఏ రోగం పేరు చెబుతాడో? డెంగ్యూ జ్వరం అంటాడా? లేక హార్మోన్స్ లోపం అని చెబుతాడా? ఒక సంధిగ్ధావస్థలో ఉద్విగ్నస్థితిలో వుంది. గతకొద్ది రోజులుగా ఆకలి మందగించడం, అకస్మాత్తుగా మూడు కేజీలు బరువు తగ్గటం, అలసటగా వుంటూ ఎక్కువగా నిద్రపోవడం - ఈ మార్పులు చూసి ఎందుకైనా మంచిది అని డాక్టర్ ని సంప్రదించగానే కొన్ని బ్లడ్ టెస్ట్ లు, మామ్మోగ్రాం చేయించుకోమన్నారు. డబ్బుకి వెనకాడకుండా, తు.చ. తప్పకుండా అన్ని టెస్ట్ లూ చేయించుకుంది. పాపం! ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఇటు డాక్టర్ దయానంద్ కరుణ హావభావాలను చదువుతూ ఆమెను తను చెప్పబోయే వార్తను విని తట్టుకునే శక్తి కలగడానికి సిద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నాడు.

'కరుణా! ధైర్యంగా వుండి ట్రీట్ మెంట్, మెడికేషన్ తీసుకుంటే తప్పకుండా బైట పడగలరని భావిస్తున్నాను. మీకు బ్రెస్ట్ కేన్సర్ డయాగ్నైజ్ అయింది. డాక్టర్ గా మేము చేయవలసింది చేస్తాము.'

ఒక్కసారిగా కరుణ తన చెవులను తాను నమ్మలేకపోయింది. మళ్ళీ కన్ ఫర్మ్ చేసుకోడానికి అడిగింది, 'ఏమంటున్నారు మీరు? నాకు కేన్సరా? నిజంగానా? నమ్మలేకపోతున్నాను డాక్టర్!'

'కరుణా! తప్పదు ఈ నిజం చెప్పాలి. ఒకటికి పదిసార్లు నేను చెక్ చేసి మీకు కన్ఫర్మ్ చేస్తున్నాను. ఈ పరిస్థితిలో మీనించి పూర్తి సహకారం, బ్రతకగలననే ధైర్యం మీలో నింపుకుంటే మీరు ఈ మహమ్మారి నించి బయటపడగలరు. గతంలో నేను ట్రీట్ చేసిన పేషెంట్లు బయటపడిన వారు కూడా వున్నారు.'

వైద్యుడిని దేముడి తరవాత దేముడంటారు. కరుణ వైద్యుడిని తను పూజించే షిర్డి సాయిబాబాగా భావిస్తుంది. వైద్యుడి దగ్గిర ఏ విధమైన భేషజం లేకుండా రోగలక్షణాలు చెప్పాలి. మగ, ఆడ అన్న తేడా వైద్యుడిలో చూడకూడదు. ఆఖరికి ఎంత లేడీడాక్టర్ దగ్గిరకి అని వెళ్ళినా ఒక్కోసారి వాళ్ళు కొన్ని కేసులు రిజిస్ట్రార్ కి రిఫర్ చేయడం జరుగుతుంది. ఈ మధ్యకాలంలో చాలామటుకు గైనకాలజీలో మగడాక్టర్లు కూడా స్పెషలైజ్ చేస్తున్నారు.

కరుణ తనని తాను మామూలు స్థితిలో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ అంది, 'డాక్టర్! ఇప్పుడేమిటి చెయ్యటం? ఈ నిజాన్ని నా భర్త తట్టుకోలేరు. నేను నా ఆప్తమిత్రుల సాయం తీసుకోవాల్సి వుంటుంది. నా భర్తకి మటుకు ఈ నిజం చెప్పను.'

'కరుణా! మీ బాధ నాకు అర్థం అయింది. నా మీద నమ్మకం వుంచండి. మీ ప్రైవసీకి ఏ విధమైన భంగం కలగదు. నా వంతు సహకారం మీకు ఎప్పుడూ వుంటుంది. మీరు చేయవలసిందల్లా కీమోథెరపీకి ఆస్పత్రిలో త్వరగా అడ్మిట్ అవాలి. దానికి తగ్గ డబ్బు మీరు డిపాజిట్ చెయ్యాల్సి వుంటుంది. మీకు తోడుగా ఎవరినైనా తెచ్చుకోవచ్చును.'

డాక్టర్! మీరు రిపోర్ట్ ఇస్తే వర్క్ లో సిక్ లీవ్ అప్లై చేసి డబ్బు సమకూర్చుకుంటాను. వెంట నా స్నేహితుడిని తీసుకువస్తాను. వాళ్ళకి మీరు విషయాలు ఎప్పటికప్పుడు అందజేయవచ్చు.'

'కరుణా! దటీజ్ ద స్పిరిట్! మీ పాజిటివ్ ఏటిట్యూడ్ నాకు నచ్చింది. నేను ఇప్పుడే డాక్యుమెంట్స్ మీ జాబ్ కి అవసరమైన వివరాలతో ఇస్తున్నాను. ఈ వ్యాధి ఎర్లీ స్టేజ్ లో వుండటం వల్ల సరైన సమయంలో ట్రీట్ మెంట్ తీసుకుంటే తప్పకుండా మీరు మామూలు మనిషి కాగలరు. ఆల్ ది బెస్ట్!'

కరుణ ఆస్పత్రి నించి బైటపడి పక్కనే వున్న కేంటీన్ లోకి అడుగులేసింది. వేడిగా ఒక టీ ఆర్డర్ చేసింది. చుట్టూ వున్న వ్యక్తుల్ని చూస్తూవుంటే వాళ్ళంతా ఎంత ఆనందంగా వున్నారో కదా అనిపించింది. తన పరిస్థితి చూస్తే తనకే జాలి వేసింది. ఇంతలో బేరర్ టీ తీసుకురాగానే కాసేపు ఆలోచనలని జోకొట్టి, వేడి వేడి టీని రంగు, రుచి, సువాసనలతో ఆస్వాదిస్తూ తాగింది. 'నిజంగా మస్తిష్కంలో జరిగే తర్జనభర్జనలకు ఈ తేనీరు ఎంత చక్కటి రిలీఫ్! మెదడులో పజిల్ గా ఉన్న చిక్కుముడులన్నింటికీ ఒక పరిష్కారాన్ని అందిస్తోంది నా ఈ మధురమైన చాయ్!'

కరుణ టీ తాగాక తను కూడా ఇప్పుడు మిగతా వారిలానే ఆనందంగా వున్న అనుభూతికి లోనయింది.

'నేను ఇప్పుడు ధైర్యంగా నాకొచ్చిన సమస్యను ఎదుర్కోగలను. ఏమైనా సరే పోరాడుతాను. క్రికెటర్ యువరాజ్ సింగ్, తనకిష్టమైన హీరోయిన్ మనీషా కొఇరాల వీళ్ళంతా ధైర్యంగా కేన్సర్ నుండి బయట పడ్డారు కదా.   ఇక ఆపై భగవంతుడు, ఆ జగన్మాత నాకు తోడు ఉన్నారు.' అని తనకి తను ధైర్యం చెప్పుకుంది.

వచ్చిన చిక్కల్లా భర్త కు తెలీకుండా జాగ్రత్తగా మెనేజ్ చేయాలి. ఇపుడిపుడే తల్లి పోయిన బాధనుంచి తేరుకుంటున్నాడు. చాలా సున్నిత మనస్కుడు. దానికి తోడు ఉన్న ఒక్కగానొక్క కొడుకు పదవ తరగతి పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు.

తన కొలీగ్ సూర్యానికి ఫోన్ చేసి తన ఆరోగ్య పరిస్థితి, ఇంట్లో పరిస్థితి గురించి వివరంగా చెప్పింది. సూర్యం చిన్ననాటి స్నేహితుడు మరియు వర్క్ లో  వేరే డిపార్టుమెంట్ లో చేస్తున్నాడు. తనని సిస్టర్ అంటూ ఎంతో అభిమానంగా ఆదరించే మనిషి.

'కరుణా! ధైర్యంగా ఉండు. నీకేమి కాదు అని సూర్యం భరోసా ఇచ్చాడు.'

సూర్యంతో మాట్లాడాక కరుణకి పూర్తి భారం దిగినట్టుగా అనిపించింది.

ఇంట్లో వేళకి పనిమనిషి సత్తెమ్మ, వంటమనిషి రాజ్యం ఉన్నారు కాబట్టి ఈ ట్రీట్మెంట్ సమయంలో తను లేకపోయినా భర్తకి, కొడుకుకి ఇబ్బంది కలగదు అనుకుంది.

ఇంటికి వెళ్ళగానే తనకు అవసరమైన వస్తువులు,బట్టలు పెట్టెలో సర్దుకుంది.

భర్త ఆనంద్, కొడుకు కిరణ్ రాగానే తను 'ప్రోజెక్ట్ వర్క్ మీద కొన్నాళ్ళు ఫీల్డ్ వర్క్ కోసం మూడు నెలలు మీకు దూరంగా వెళ్ళాల్సి ఉంటుంది. నేను మీకు ఫోన్ లో దొరకను. పని కాగానే వచ్చేస్తాను. మీ ఇద్దరి సహకారం కావాలి నాకు ఈ విషయంలో' అని చెప్పింది. భర్త, కొడుకు మొదట్లో కాదన్నా, తరువాత ఒప్పుకున్నారు.

ఆ మరునాడే ఆఫీస్ కి వెళ్ళి పేపర్ వర్క్ పూర్తిచేసి, సిక్ లీవ్ తీసుకుంది. కావలసిన డబ్బు సమకూర్చుకుంది. తరువాతి రోజు సూర్యాన్ని నేరుగా హాస్పిటల్ కి రమ్మంది కరుణ.

డాక్టర్ కి సూర్యాన్ని పరిచయం చేసింది. హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యింది అదే రోజు.

డాక్టర్ తో పాటు, ఇతర అసిస్టెంట్ డాక్టర్స్, క్లినికల్ నర్స్ కలిసి ట్రీట్మెంట్ విధానము, ఒక్కో స్టేజ్ కి ఎంత సమయం పడుతుంది అన్ని వివరంగా కరుణతో, సూర్యం తో చర్చించారు.

'మొదటగా ట్యూమర్ తీసివేయడానికి సర్జరీ చేస్తా ము. ఆ తరువాత రేడియేషన్ థెరపీ, మరియు డ్రగ్ థెరపీ ఇస్తాము. సుమారుగా మూడు నెలలు సమయం పడుతుంది.

'ప్రతి దశలోను, మీరు రెస్పాండ్ అయ్యే తీరు, మీ శరీరం ఎలా తట్టుకుంటోందో పరిశీలిస్తూ ఉంటాము. మిమ్మల్ని చూసుకోవడానికి క్లినికల్ నర్స్ సరోజను ఏర్పాటు చేసాము.'

సూర్యం అన్ని జాగ్రత్తగా విని, తన అవసరం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు రావాలో తెలుసుకుని కరుణకు మానసికంగా ధైర్యాన్ని చెప్పాడు. మెల్లిగా కరుణను ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్ళడానికి స్టాఫ్ రెడీ అవుతున్నారు.

కరుణ మనసు నిర్మలంగా ఉంచుకుంది. తనకు జన్మనిచ్చిన తల్లితండ్రులను, అత్త మామలు, భర్త, కొడుకు, ఇష్టదైవాన్ని తలుచుకుంది.

'నేను ఈ భూమిమీద జన్మ ఎత్తడం నేను చేసుకున్న పుణ్యం. నా బాధ్యతలు అన్ని పూర్తి చేసుకున్నాకనే నేను నా తనువును విడిచిపెట్టడం జరుగుతుంది. నేను చేయవలసిన సత్కార్యాలు ఎన్నో ఉన్నాయి. నాకు ఆ భగవంతుడి అనుగ్రహం ఉంది.' అని మనసులో ఆటో సజెషన్స్ ఇచ్చుకుంది.

సర్జరీ చేసి ట్యూమర్ ని తొలగించారు డాక్టర్లు. మెల్లిగా స్పృహలోకి వచ్చింది కరుణ. శరీరం అంతా తేలికగా, ఒక పెద్ద భారాన్ని తీసివేసినట్టుగా హాయిగా అనిపించింది. డాక్టర్లు, నర్సులు ఎప్పటికప్పుడు అబ్జర్వేషన్స్ చెక్ చేస్తున్నారు.

ఆ తరువాత ఆమెను రేడియేషన్ థెరపీకి సంసిద్ధం చేసారు.
తను ప్రతి నిత్యం అవలంబించే మెడిటేషన్ మహిమో ఏమో కాని, కరుణ నెమ్మది, నెమ్మదిగా నిశ్చల స్థితి లోకి వెడుతూ మరింత ధైర్యాన్ని పుంజుకుంది. రేడియేషన్ థెరపీ కావడానికి, పెయిన్ ఫుల్ ప్రొసీజర్ ఐనా కాని, భగవంతుని నామం నిరంతరం మనసులోనే జపించుకోసాగింది. ఆమె ఆత్మస్థైర్యానికి డాక్టర్లు,నర్సులు అబ్బురపడ్డారు.
ఈ రేడియేషన్ థెరపీ జరుగుతున్న సమయంలో కరుణ చక్కని నల్లని కురులను కోల్పోయింది. మనిషి సన్నబడిపోయింది.
సూర్యం వీలు ఉన్నప్పుడల్లా కరుణను చూసి, బాగోగులు విచారించి వెడుతున్నాడు.
కరుణకు ఈ మధ్య పదే పదే భర్త, కొడుకు మనసులో మెదులుతున్నారు. డాక్టర్ దయానంద్ విజిట్ కి వచ్చినపుడు అడిగింది. 'ఎలా ఉంది డాక్టర్ ఇప్పుడు నాకు?'
'కరుణా! నిజంగా అనుకున్నదానికన్నా నువ్వు చాలా బాగా రికవరీ అవుతున్నావు. త్వరలోనే నువ్వు మామూలు మనిషి అవుతావన్న నమ్మకం నాకుంది. '
'ఐతే డాక్టర్ ఒకసారి నేను ఇంటికి వెళ్ళవచ్చా?'
'ప్రస్తుతం మేము వాడుతున్న మందులు ఆపి చూద్దామనుకుంటున్నాము. నువ్వు మళ్ళీ వారం రోజులలో రావాల్సి ఉంటుంది.'
'ఆ మాట చాలు డాక్టర్. ఐతే రేపే ఒకసారి నా భర్తను, అబ్బాయిని చూసుకోవడానికి వెడతాను.'
డాక్టర్ రిపోర్ట్స్ చెక్ చేసి, మరోసారి జాగ్రత్తలు చెప్పి వెళ్ళాడు.
కరుణ నర్స్ సాయం తీసుకుని, తలకు విగ్గు పెట్టుకుని ఒకసారి అద్దంలో తన మొహం చూసుకుంది. మనిషి చూడటానికి సన్నబడి, విగ్గు వల్ల కాస్త మోడ్రన్ గా కనబడుతోంది. భర్తకు ఏ మాత్రం అనుమానం రాదు అనుకుంది.
క్యాబ్ బుక్ చేసుకుని ఇంటికి బయలుదేరింది. ఇంటికి వెళ్ళగానే కాలింగ్ బెల్ కొట్టింది. ఆ సమయంలో భర్త టివి చూస్తున్నాడు.
కొడుకు ఎసైన్మెంట్ వర్క్ చేసుకుంటున్నాడు.
ఆనంద్ మొదట కరుణను పోల్చుకోలేకపోయాడు.
'ఓ కరుణా? వస్తున్నట్టు ఫోన్ చేయలేదేమిటి? చాలా మారిపోయావ్?'
ఆనందంగా కన్నీళ్ళు పెట్టుకుంటు 'ఎలా ఉన్నారండి?' అంటూ వెళ్ళి కొడుకుని హత్తుకుంది.
ఇంతలో సూర్యం ఫోన్ చేసి 'క్షేమంగా చేరావా కరుణా? అని కనుక్కున్నాడు.
భర్త ఆనంద్ కాస్త ముభావంగా ఉండటం గమనించింది. 'భగవంతుడా! ఇంటికి అనవసరంగా వచ్చానా? ఈయన ఒక్క మాట మాట్లాడటం లేదేమిటి? ఇంట్లో నా స్థానాన్ని, గౌరవాన్ని కోల్పోయానా?' అనుకుంది.
ఆ రెండు రోజులు వారి మధ్య నిశ్శబ్దమేలింది.
కరుణ ట్రీట్మెంట్ ఐన తర్వాత నుండి మానసికంగా మరింత బలవంతురాలైంది. తను క్యాన్సర్ తో పోరాడిన మీదట, ఇప్పుడు జరిగిన సంఘటన చాలా  చిన్న విషయంలా అనిపించింది.
ఏ బాధ, గాయం నయమవ్వాలన్నా కొంత సమయం, పెర్సనల్ స్పేస్ తీసుకుంటే మనిషి మళ్ళీ మామూలుగా అవ్వవచ్చు.
ఆనంద్ విషయంలోను అదే జరిగింది. తల్లి పోయిన బాధనుంచి కోలుకున్నాడు గాని, ఆ స్థానంలో భార్య దూరంగా ఉండటంతో ఎన్నో సందేహాలు మొదలయ్యాయి.
'ఇన్నాళ్ళూ నిజంగా కరుణ జాబ్ కోసమే వెళ్ళిందా? ఒకసారి ఆఫీస్ కు ఫోన్ చేస్తే లీవ్ లో ఉందన్నారు.
ఇప్పుడు ఆమె అవతారం చూస్తుంటే ఏమిటి నల్ల జుట్టు బాబ్ హెయిర్ కట్? ఏ సందర్భం లేకుండా ఏమిటి కొత్త అవతారం?

ఇంటిపని మీద కూడ ఈ రెండు రోజులు ధ్యాస పెట్టడం లేదు. వచ్చిందన్న మాటే గాని హాయిగా ఏమి పట్టనట్టు నిద్రపోతోంది.
కనీసం నాకు కోపం వచ్చిందా, దగ్గిరకొచ్చి అనునయించే ప్రయత్నం కూడా చేయడం లేదు.
ప్రేమించి తనను పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరి మధ్య ఏ రహస్యాలు లేవని నమ్మాను.
నాతో అన్నివేళలా స్నేహితురాలి లా, ప్రియురాలిలా జీవితాన్ని పంచుకున్న నా కరుణ ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తోంది?
ఈ మౌన పోరాటం నా వల్ల కాదు. పొద్దున్నే అడిగేస్తాను' అని మనసులో ధృఢంగా అనుకున్నాడు.
కరుణ లేవగానే సత్తెమ్మ, రాజ్యం తో కబుర్లు చెప్పింది. కొడుకు చదువు గురించి పరీక్షలు ఎలా రాస్తున్నాడో అడిగి తెలుసుకుంది.
భర్త కోపం వస్తే వెంటనే మాట్లాడడని తెలుసు. అందుకే ఆనంద్ ను పలుకరించలేదు.
'ఏమండీ! నేను ప్రోజెక్ట్ వర్క్ మీద మళ్ళీ వెళ్ళాలి రేపు.'
'నిజంగా నువ్వు ఆఫీస్ పనిమీదే వెడుతున్నావా?'
'అవును, నేను వెళ్ళడం చాలా అవసరం'
'నువ్వు వెళ్ళకుండా వుండడం నాకు చాలా అవసరం.'
'ఏమండీ, ఈ ఒక్కసారికీ నన్ను వెళ్ళనివ్వండి.'
ఆనంద్ లో ఆవేశం ఒక్కసారిగా ఎగదన్నుకు వచ్చింది. 'ఇంక ఈ నాటకాలు కట్టిపెట్టు కరుణా! నేను నీకు ఉత్తి చవటలా కనిపిస్తున్నానా? ఇంక నావల్ల కాదు. ఇపుడిపుడే అమ్మ పోయిన బాధను దిగమింగుకుని మామూలు మనిషిని కావడానికి ప్రయత్నిస్తున్నాను . నాకు వ్యవధి లేకుండా నీ నుంచి ఈ దెబ్బ ఏమిటి?
కరుణ బిత్తరపోయింది. 'ఏమండీ! ఏమిటి, అలా మాట్లాడుతున్నారు?'
ఆనంద్ గట్టిగా అరిచాడు, 'ఇంకెలా మాట్లాడమంటావు? నేను నిన్ను అనుమానించేంత హీనుడను కాను. నువ్వే నా సర్వస్వమని నమ్మాను. నీకు నాకు మధ్య ఇప్పుడు ఒక అగాధము ఏర్పడింది. నాకు ఏంజరుగుతోందో, నిజమేమిటో తెలియాలి. ఏమిటి అర్థం, పర్థం లేని ఈ కొత్త అవతారం? ఎవరా సూర్యం? అసలేం జరుగుతోంది?

వారం రోజుల క్రితం మీ ఆఫీసుకు ఫోన్ చేసాను. నువ్వు సెలవులో ఉన్నావని, కొన్నాళ్ళ నించి ఆఫీసుకు రావటల్లేదని చెప్పారు. ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళావో నాకు తెలీదు. దేనికి వెళ్ళావో అది కూడా తెలీదు. ఇంటికొచ్చినట్లే లేదు. అప్పుడే మళ్ళీ ఏదో ప్రాజెక్ట్ వర్కు ఉందంటూ మళ్ళీ ఎక్కడికో వెళిపోతున్నావు. నన్ను మోసం చెయ్యాలని నీకెలా అనిపించింది కరుణా?'
'ఏమండీ, నేను మిమ్మల్ని మోసం చెయ్యటల్లేదండి.'

'మరి ఈ అబద్ధాలన్నీ ఏమిటి? మన మధ్య ప్రేమ వుంది, స్నేహం వుంది. మనం ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం బాగా అర్థం చేసుకున్నామన్న భావనలో నేను వున్నాను. అటువంటిది ఈ రోజున నా నుంచి నువ్వు ఏదో దాస్తున్నావు. మన మధ్య కూడా చెప్పుకోకూడని రహస్యాలు, దాపరికాలు వున్నాయా కరుణా?
నాకు నిజం చెపుతావా, ఏ ఏట్లోనో దూకమంటావా? '
మీరు ఇంత మాటఅన్నాక, ఇంత దూరమొచ్చాక నాలో దాచుకున్న ఈ అగ్నిగుండాన్ని బయట పెట్టాలి. దాన్ని తట్టుకునే ధైర్యం మీకుందా? మీకు తట్టుకునే ధైర్యం, శక్తి ఉంటే నేను చెప్పగలను.
'ప్రతి రోజు నిజమేమిటో తెలియకుండా, ఛస్తూ బతికే కన్నా అసలు విషయమేమిటో తెలియడమే మంచిది.
కరుణ కళ్ళనుంచి కన్నీరు ఉబికి వచ్చింది. అది దుఃఖంగా మారి వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఆనంద్ కొంచెం చల్లబడ్డాడు. 'కరుణా! నిన్ను నేను అనుమానించటల్లేదు. నేను నీ భర్తగా కాదు, స్నేహితుడిగా అడుగుతున్నాను. ఏమిటి నీ సమస్య? అసలేం జరుగుతోంది? రహస్యంగా బ్రతకాల్సిన అవసరం నీకేమొచ్చింది? నాతో చెబుతే నేను నీకేమన్నా సాయపడతానుగా?'

'మీకు చెప్పకూడదనే అనుకున్నానండి. కాని ఇవాళ ఇలా నిలదీసి అడుగుతూంటే, ఇంక మీ నుంచి ఏదీ దాచాలనిపించటల్లేదు. మీరు, బాబు నాకు భగవంతుడు ప్రసాదించిన వరం. మీ ఇద్దరికీ నేను దూరం కాలేనండి.'

'కరుణా! ప్లీజ్! కాస్త వివరంగా చెప్పు.'

'కొంచెం నలతగా వుంటోందని డాక్టరు దగ్గిరకి వెళ్ళాను. డాక్టరు నాకొక భయంకరమైన నిజం చెప్పాడు. నాకు... నాకు బ్రెస్ట్ క్యాన్సర్. మీకు దూరం కాకూడదనే ఎదురొడ్డి పోరాడుతున్నాను. ఈ నిజం మీకు తెలిస్తే ఏ మౌతారో అని నాలో నేనే కుమిలిపోయాను.

చెప్పండి, అసలే బాధలో ఉన్న మీకు ఈ విషయం చెప్పితే మీరు తట్టుకోగలరా? నాకు మెంటల్ సపోర్ట్ ఎవరిస్తారు?

'అవునండీ. విధినే ఎదిరించాలనుకుంటున్నాను. ఆత్మవిశ్వాసంతో ఆస్పత్రిలో చేరి గత కొద్దిరోజులుగా ట్రీట్ మెంట్ తీసుకుంటున్నాను. జుట్టు ఊడిపోయింది. అందుకే విగ్గు పెట్టుకుని వచ్చాను. నాకు అన్నలాంటి సూర్యం చేదోడు వాదోడుగా ఉంటూ నాకు ఈ మూడు నెలలు సహకరించాడు.'

ఆనంద్ నిర్ఘాంతపోయాడు. 'కరుణా! ఏమిటి నువ్వంటున్నది? నువ్వు నా ప్రాణంలో ప్రాణానివి, నువ్వు నాకు దూరమౌతున్నావనే బాధతో ఇలా మాట్లాడాను. ఇన్నాళ్ళూ అమ్మ పోయిన బాధతో నువ్వు ఎలా ఉన్నావో కూడా చూడలేకపోయాను. నీ మనసును బాధ పెడితే నన్ను క్షమించు. నా అతి సున్నిత స్వభావంతో ఇన్నాళ్ళు నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయాను.'

'ఇప్పుడు మళ్ళీ ఆస్పత్రిలో చేరడానికే వెళుతున్నాను. నాకు ఆత్మవిశ్వాసం వుంది. బలమైన నమ్మకం ఉంది. నా ఆత్మవిశ్వాసం, నా చెరిగిపోని ధైర్యం నన్ను తప్పక బ్రతికిస్తాయన్న నమ్మకంతోనే తిరిగి ఆస్పత్రికి వెళ్తున్నాను. నన్ను నమ్మండి. నేను ఖచ్చితంగా సంపూర్ణారోగ్యంతో తిరిగి వస్తాను.'

'కరుణా! నీకేమి కాదు. నీకు పూర్తిగా నయమవుతుంది.పద! మిగతా ట్రీట్మెంట్ కి వెడదాం.నీ వెంట నేనున్నాను.'

ఇపుడు ఆమె మనసు దూదిపింజంలా తేలికగా ఐపోయింది. తనను ఏ వ్యాధి ఏమి చేయలేదు. అన్నిటిని దాటుకుంటు వచ్చేసాను. నా భర్త తోడు నాకుంది. నేను బ్రతకాలనుకున్నంత కాలం ఆనందంగా బ్రతికేస్తాను.

అవును! నాకు బ్రతకాలనుంది! అని ఆనందగా అనుకుంటూ భర్తతో **మనోనిబ్బరం**తో హాస్పిటల్ కి బయలుదేరింది.

**జాగృతి వారపత్రిక డిశెంబర్ 2, 2019 సంచికలో ఈ కథ ప్రచురితమైనది.**

❖❖❖❖❖


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

# దీపభ్రమర న్యాయం

"హాయ్... గుడ్‌మార్నింగ్..."

"ఎవరు? మీరెవరు మాట్లాడుతున్నారు?"

"మీ ఫ్రెండ్‌ని... మిమ్మల్ని అభిమానించేవాడిని."

"ఇదిగో, మీరెవరో మీ పేరు చెప్పండి ముందు."

"పేరా... నీ పేరు రాధ గదా, నా పేరు రాధాకృష్ణ. భలే కలిశాయి గదా మన పేరు... హా...హా..."

"చూడు, నీవెవరో నాకు తెలీదు. పెట్టేయ్ ఫోను."

"పెట్టేయడానికా చేసింది. కాసేపు మాట్లాడుకుంటే స్నేహితులం అయిపోతాం గదా! నీతో మాట్లాడాలని, స్నేహం చెయ్యాలని ఆశగా చేస్తే..."

"ఇదిగో నీతో మాట్లాడాలని, నీలాంటి పోకిరీగాళ్లతో స్నేహం చెయ్యాలని నాకేం లేదు."

"అబ్బ! అంత కోపమే... కాస్త తియ్యగా మాట్లాడమ్మా. నేనేం పోకిరీని కాదు."

"చూడబ్బాయి, నీవెవరో నాకు తెలియదు. నీతో నాకు స్నేహమేమిటి?



పిచ్చెక్కి మాట్లాడుతున్నావా?"

"అవును, పిచ్చెక్కింది. ఫేస్బుక్‌లో నిన్ను చూసి పిచ్చెక్కి... మతి పోగొట్టుకొని ఆ జారిన గుండె ఎక్కడుందో వెతుక్కుంటూ, నీ ఫోను నెంబరు వెతుక్కు పట్టుకుని... యింత కష్టపడి ఫోను చేస్తే, రెండు నిమిషాలు మాట్లాడితే నీ సొమ్మేం పోయిందమ్మా?"

"ఏమిటి, ఫేస్‌బుక్‌లో చూశావా? నువ్వెవరు, నన్నెలా చూశావు? నీవు నా ఫ్రెండ్ లిస్ట్‌లో వున్నావా? లేవు గదా, తెలీనివాళ్లతో నేను స్నేహం చెయ్యను.

"మాట్లాడుకుంటే గదా తెలిసేది. రెండు రోజులు మాట్లాడుకుంటే స్నేహితులవుతాం గదా, నీకు మంచి స్నేహితులక్కరలేదా? నిన్నభిమానించే స్నేహం వద్దా? నీవు కావాలనుకునే మనిషి వద్దా... మాట్లాడుకుని, అభిప్రాయాలు పంచుకుంటూ, ఆలోచనలని మెచ్చుకుంటూ, అభిరుచులని చర్చించుకుంటుంటే స్నేహం జతకడుతుంది. మనసులని దగ్గర చేస్తుంది. మనసులు కలిస్తే మనుష్యులు దగ్గరవుతారు.

"చాల్చాలు, కవిత్వం బాగా వచ్చులా వుంది నీకు. మాటలు భలే చెప్తున్నావు. గొప్ప మాటలు వర్ణిస్తున్నావు."

"గొప్ప మాటలు కావు... మనసులో మాటలు. నేనేం గొప్పవాడిని కాను తల్లీ! నీలాంటివాడినే, ఈడు జోడే కాదు, తాహతులెరిగి, సరితూగే వాళ్లమే గదా అని నిన్ను యిష్టపడి, స్నేహం కోసం వెతులుకులాడుతూ నీ ముందుకు వచ్చానని లోకువ కట్టేయకు."

"చాలా వివరాలు సేకరించావులా వుంది. నా గురించేం తెలుసు, ఎలా తెలుసు? ముందు చెప్పు..."

"ఇష్టం కలిగితే, కష్టపడి వెతికి పట్టుకోవద్దా? నీ గురించి వివరాలు రాబట్టకుండానే నీతో స్నేహానికి వచ్చాననుకున్నావా?"

"అబ్బో... నా గురించేం తెలుసో చెప్పు వింటాను."

"నీవు యింటర్ పరీక్ష రాశావు. లోవర్ మిడిల్ క్లాసు అమ్మాయివి. మీ నాన్న బ్యాంక్‌లో అటెండర్. నీకో తమ్ముడున్నాడు. చిన్న యిల్లు. అతి మామూలు సంసారులు. చాలా? ఇంకేమన్నా చెప్పాలా?"

"మరి నాలో ఏం చూసి స్నేహం చెయ్యాలనుకున్నావు? నేనేం పెద్ద అందగత్తెను కాను, పెద్ద చదువులు లేవు. ఉద్యోగాలు లేవు, డబ్బులు లేవు. ఏం చూసి వెంటపడ్డావు?"

"ఇదిగో అలా మాట్లాడకు. వెంటబడలేదు. నచ్చావు, మెచ్చాను, కావాలనుకున్నాను. నేనేం నీకంటే గొప్పవాడిని కానుగా, నేనూ లోవర్ మిడిల్ క్లాస్ అబ్బాయినే. మా నాన్నది గవర్నమెంటు జాబు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో చిన్న ఉద్యోగి. నాకో చెల్లెలు. అమ్మ బ్యాంక్‌లో అటెండర్ పనిచేస్తుంది. నేను బీకాం ఫస్టియర్ చదువుతున్నా... ముందే చెప్పాగా.... అన్నీ సరిచూసుకునే సరిజోడి అనుకున్నానని. నే చెప్పినవన్నీ కరెక్ట్ గదా!"

"ఓహో... బీకాం చదువుతూనే ఉద్యోగం అది కాకుండానే అమ్మాయిలు కావాల్సి వచ్చారా? ఏం అపుడే పెళ్లి చేసేసుకుంటావా నచ్చిన అమ్మాయి కనిపిస్తే?"

"పెళ్లి తర్వాత చేసుకుంటాం. ముందు మనం కలవాలి, ముచ్చట్లాడుకోవాలి... ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారాలి. ఒకరినొకరు అర్థం చేసికోవాలి. ఎంత తతంగం వుంది. ఊరికే అలా పెద్దవాళ్లు తెచ్చిన అమ్మాయిని పెళ్లి చేసేసుకుని తర్వాత మనసులు కలవక, ప్రేమలేని సంసారం... అవన్నీ నాకు సరిపడవు. నాక్కావలసిన అమ్మాయిని నేనే చూసుకుంటాను అని చెప్పేశాను అప్పుడే యింట్లో. చదువయి, ఉద్యోగం వచ్చేలోగా చక్కగా యిద్దరం స్నేహంగా కబుర్లాడుకుంటూ, తిరుగుతూ, పార్కులలో కలుసుకుంటూ, ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలని..."

"చూడు... అంతా బాగానే వుంది. నీవు చాలా బాగా మాట్లాడుతున్నావులే. కాని మా యింట్లో అలా వప్పుకోరు. అబ్బాయిలతో తిరిగితే వూరుకుంటారా? అదేం కుదరదులే..."

"ఇదిగో, నీవు యీ కాలం పిల్లలా మాట్లాడడం లేదు. ఎవరన్నా పెద్దవాళ్లకి తెలిసేట్టు బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరుగుతారా? మనకి మనం నచ్చే స్నేహితులని వెతుక్కోవాలి. ఇవన్నీ యింట్లోవాళ్లకి చెప్పక్కరలేదు. చెప్పరు - లైఫ్‌లో... ఇప్పుడు కాకపోతే యింకెప్పుడు సరదాలు? ఫ్రెండ్స్‌తో కబుర్లు, షికార్లు యివన్నీ యిప్పుడు అందరూ చేస్తారు. ఇదేం కొత్త విషయం కాదు. ఎవరూ ఆశ్చర్యపోయే విషయం కాదు. నీ ఫ్రెండ్స్‌కి బాయ్‌ఫ్రెండ్స్ లేరా, వున్నారు గదా! అలాగే నీకూ వద్దా?"



"చూడు... అసలు నిన్ను చూడకుండా, నీవెవరో నాకు నచ్చకుండా ఫ్రెండ్ ఏమిటి?"

"అందుకే కలుసుకుందాం అంటున్నా. ఇద్దరం కలిస్తే కదా ఒకరికొకరు నచ్చేది లేనిది తెలిసేది."

"ఏమో! ఇదంతా నాకేం తెలీడం లేదు. ఎప్పుడూ తెలీని మనిషితో స్నేహం మాటలు ఏమిటి? వద్దు బాబూ! వదిలేయ్ నన్ను..."

"ప్లీజ్, ఒక్కసారి కలుద్దాం. నీకిష్టం లేదంటే అప్పుడింక నిన్ను యిబ్బంది పెట్టను. ప్రామిస్... ప్లీజ్, మాట్లాడు. ఎంతో కష్టపడి నీ నెంబరు పట్టుకుని ఫోను చేసి యింతసేపు మాట్లాడిందెందుకు? నీవంటే నచ్చి కదా! ఒకసారి కలిస్తే నీ సొమ్మేం పోతుంది? రా, నేను నచ్చితే మాట్లాడుదువుగాని, లేదంటే వెళ్లిపోదువుగాని. ఇందిరా పార్క్ దగ్గరకి రా... గేటు దగ్గిర నిన్ను గుర్తుపట్టి పలకరిస్తాను, చేతిలో చిన్న గులాబీ గుత్తి పట్టుకొంటా... ఏం వస్తావా? ప్లీజ్... ఒక్కసారి....."

"ఓ... అర్థం అయింది కథ..."

"మరి వెళ్లావా? ఆ మాటలకి పడిపోయావా... ఆ ఆకర్షణకి లొంగిపోయావా? చెప్పు. దాచకుండా నిజం చెప్పాలి. అమ్మాయిలంతా చేసే తప్పే నీవూ చేశావు. అంతేగదా! అలా కన్నీళ్లు కారిస్తే ఏం లాభం యిపుడు. నాకు తెలుసు, వెళ్లకుండా వుండలేని ఆ వయసు ఆకర్షణ..."

"నిజం డాక్టరుగారూ! ఆ మాటలకి పడిపోయాను. అసలు ఏమిటీ సంగతి, ఎలా వుంటాడో, ఏం అంటాడో చూద్దాం అనిపించింది. నచ్చకపోతే వచ్చేయచ్చు గదా... అనుకున్నా."

"వెళ్లాక నచ్చేట్టు చేసుకోడం ఆ వయసు అబ్బాయిలకి వెన్నతో పెట్టిన విద్య. అమ్మాయిలని ఎలా ఆకర్షించాలో, ఏం తీయని కబుర్లు చెప్పాలో... కవిత్వాలొలకపోసి ఎలా ఆకర్షించాలో... అమ్మాయిలని పడగొట్టే విధానాలన్నీ తెలిసినవాడే యింత ధైర్యం చేస్తాడు. ఊ... తరువాత చెప్పు..."

"డాక్టరుగారూ! మీరు అన్నీ తెల్సినవారు. మీరన్నట్టే జరిగింది. మొదటి రోజే నన్నంతగా యిష్టపడే మగవాడి, ఒక మామూలు అమ్మాయిని అందలం ఎక్కించి ఆరాధనాభావం చూపిస్తే ఏ ఆడపిల్ల లొంగిపోదు. మొదటి పరిచయంతోనే

నచ్చిపోయాడు. బోలెడు కబుర్లు చెప్పాడు. తనూ మా తరగతి మనిషి, పెద్ద డబ్బు, అందం లేకపోయినా మనసున్న మనిషి, భార్యని చక్కగా చూసుకుంటానన్న అభిప్రాయం యిచ్చాడు. నిండా పదహారు లేని అమ్మాయి అంతకంటే లోతుగా ఎలా ఆలోచించగలదు?"

"నిజమే... అమ్మాయిలు బోల్తాపడేది ఆ తెలిసీతెలియని టీనేజ్‌లోనే గదా! ఇరవై దాటాక కాస్త మెచ్యూరిటీ వస్తుంది. కాస్త విచక్షణజ్ఞానం అబ్బుతుంది. టీనేజ్ అన్నది పిల్లలని ఎన్ని ఆకర్షణలకి గురిచేస్తుందో... సరే, యిద్దరూ చాలాసార్లు వాట్సప్‌లో ఛాటింగులు చేస్తూ మరింత దగ్గరయి..."

"అవును మేడమ్, రాత్రిళ్లు నిద్ర పోనీకుండా మెసేజ్‌ల మీద మెసేజ్‌లు పంపేవాడు. అవి చూసి మురిసిపోయేదాన్ని. అంత గొప్ప ప్రేమని పొందినందుకు ఎంత అదృష్టమో అని పొంగిపోయేదాన్ని. ఒక రెండేళ్లు చదువయి ఏదన్నా పని చూసుకునేవరకూ ఎవరికీ చెప్పద్దు... అపుడు నేనూ మా యింట్లో వప్పిస్తాను. నీవూ అపుడు చెప్పచ్చు. అలాగా మన మనసులు మరింత దగ్గిర కావాలి. కల్సుకుందాం... కబుర్లాడుకుందాం. అప్పుడప్పుడు సినిమాలు, షికార్లు తిరుగుదాం అని చెప్పేవాడు. అన్నింటికీ తల ఊపేంత మత్తులో పడిపోయా... ఆ మత్తులోనే... మూడు నాలుగు నెలలు తిరిగాం... ఆ తర్వాత ఒక రోజు..."

"ఎక్కడికో తీసికెళ్లి వుంటాడు. తలపులు కలిశాయి, తనువులు కలిస్తే ఫరవాలేదు. నీవు నాదానివి. నీవు లేకుండా బతకలేనన్నాడు. నీకింక దూరం వుండలేనన్నాడు... బతిమిలాడాడు. తమకంతో చేరువయినవాడిని తప్పించుకోలేకపోయావు. అంతేనా? ఇది నీ కథే కాదమ్మా! నీ వయసులో ఆడపిల్లల కథలు యివి... నిన్ను చూస్తే జాలేస్తూంది."

"డాక్టరుగారూ... మీరు తప్ప నన్ను రక్షించేవారు లేరు. ఇది మా యింట్లో తెలిస్తే నన్ను గెంటేస్తారు యింట్లోంచి. చావడం తప్ప మరో మార్గం లేదు నాకు. ప్లీజ్... నాకు సాయం చెయ్యండి. నేను ఎవరికి చెప్పుకోవాలో తెలియక, కాలేజీనించి వచ్చే దారిలో మీ క్లినిక్ చాలాసార్లు చూసి వచ్చా. మీరే నన్ను ఈ ఆపదనించి గట్టెక్కించాలి..."

"చూడమ్మా... యిపుడు ఎంత ఏడ్చినా జరగాల్సింది జరిగింది. నీ పరిస్థితి అర్థమైంది. ఏ తల్లీ తండ్రి యిలాంటి కూతురిని క్షమించలేరు. కాని కన్నవారు



కనక నిన్నింక కాలేజీ మాన్పించి యింట్లో కూర్చోపెట్టి, గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించి, ఎవడితో ఒకడిచే మూడుముళ్లు వేయించి బాధ్యత తీర్చుకుంటారు. కాని, నాకు కొన్ని ప్రిన్సిపల్స్ వున్నాయి. ఇలాంటి పనులు నేను చెయ్యలేను, చేయను. ఎంతోమంది అమ్మాయిలు తప్పటడుగులు వేసి తప్పు కడుక్కోడానికి వస్తుంటారు. కాని నేను చెయ్యనని తెలిసి యింకెవరినో వెతుక్కుంటారు..."

"అలా అనకండి డాక్టర్! నాకింక ఎవరూ తెలియదు. ఇంట్లో తెలీకుండా, ఎవరూ చూడకుండా వచ్చాను. ప్లీజ్... నన్ను కాపాడండి... ఆ దొంగ రాస్కెల్ నేను ప్రెగ్నెంట్ అని విన్న తరువాత మాయం అయిపోయాడు. ఫోన్ బ్లాక్ చేశాడు. ఇల్లెక్కడో కూడా తెలియదు. కనీసం నన్నీ ఆపదనించి గట్టెక్కిస్తాడేమోనన్న ఆశ కూడా పోయింది. ఇంత దగా చేస్తాడనుకోలేదు..."

"ఇలాంటి పరిచయాలు, యీ ప్రేమ కబుర్లు దగా చేసేవారే వల్లిస్తారు. ఈ సంగతి మీ ఆడపిల్లలు ఎన్నాళ్లయినా గ్రహించలేకుండా మోసపోతూనే వుంటారు. కథలు చదువుతారు, టీవీలు, సినిమాలు చూస్తారు. అయినా, అంత సులువుగా బుట్టలో పడిపోతూనే వుంటారు. 'దీప భ్రమర న్యాయం' అంటే ఇదేనేమో! దీపం వేడికి మాడి భస్మం అవుతున్నా ఆలోచన లేకుండా ఆ వెలుగుకి ఆకర్షితమై భస్మం అవడం సృష్టిలో సహజంలాగే, మీలాంటి ఆడపిల్లలు అంతే! కాస్త చదువు వున్న మీలాంటి పిల్లలే యింత సులువుగా మోసపోతున్నారు. ఒక్క క్షణం కాస్త లోతుగా ఆలోచిస్తే, నాలో ఏముంది? పెద్ద అందగత్తెని కాను, మామూలు చదువు, అతిమామూలు కుటుంబం. నాలో ఏం చూసి ప్రేమిస్తాడు అని ఏ అమ్మాయన్నా ఆలోచిస్తే... యిలాంటి మాటలన్నీ, ప్రేమలన్నీ కాలక్షేపం కబుర్లు, వయసు వేడిలో ఆకర్షణ. సులువుగా దొరికే అమ్మాయిలకి వల అన్నది గుర్తించరు. తానేదో రంభ ఊర్వశీ అని వలచి వచ్చాడని మురిసి ఆ ప్రేమపాశంలో చిక్కుకుపోతారు."


"డాక్టరుగారూ! మీరు చెప్పిందక్షరాలా నిజం. ఎంత సులువుగా నమ్మాను. ఎన్ని కబుర్లు చెప్పి మురిపించాడు. ప్రేమంటే యిదే, యింతకు మించింది యింకేం కావాలి అన్న భ్రమలో పడేశాడు. అవసరం తీరగానే పక్కకి తోసి పోయాడు నిర్దాక్షిణ్యంగా. ఇప్పుడింక యీ దారి తప్ప నాకే దారి లేక మీ దగ్గిరకి వచ్చాను. ఇదిగో కాస్త కాస్త పాకెట్ మనీ దాచుకొన్న ఐదొందలుంది. ప్లీజ్... డాక్టరుగారూ! మీ కాళ్లు పట్టుకుంటాను."

డి. కామేశ్వరి

"ఛా... ముందు లే అమ్మా! చూడు నిన్ను చూసి జాలేసినా నా నియమాన్ని వదలలేను నేను. ఇదిగో యింకో డాక్టరు పేరు, అడ్రసు యిస్తాను. ఆవిడకి నోట్ పెట్టాను. ఆమె నీ పని చేస్తారు. అంతకంటే నేనేం చెయ్యలేను. ఇదిగో యీ రెండేవేల రూపాయలుంచుకో. డాక్టరుగారికి, మందులకి కావల్సి వుంటుంది. జాగ్రత్తగా వెళ్లు. ఆలస్యం చెయ్యకు. వెళ్లమ్మా! ఆ చదువు పూర్తిచేసి, నీ బాగుకోరే అమ్మా నాన్న తెచ్చిన సంబంధం చేసుకో. అత్యాశలకి పోకు. ఇది నా సలహా. వెళ్లు. ఆ డాక్టరుగారికి నిన్ను పంపిస్తున్నట్టు ఫోను చేస్తాను. సరేనా? వెళ్లమ్మా!"

(ఆకాశవాణి సౌజన్యంతో)

❖❖❖❖❖




❖❖❖❖❖






❖❖❖❖❖


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW



# Kameswari



| | | |
|---|---|---|
| Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are end times and Varjyam is start and end times in Australian Eastern Standard Time. | **DECEMBER 2019**<br>శ్రీ వికారి సంవత్సర<br>మార్గశిర శు పంచమి to పుష్య శు పంచమి | Su – Suddha Ba – Bahula/Krishna<br>Va – Varjyam R – Raahu Kaalam<br>Full – Thidhi or Nakshtra spread over midnight to midnight (24 hrs).<br>Times applicable in NSW ACT VIC. |

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>R - 16:30 to 18:30 | **1** మార్గశిరం<br>శు పంచమి పూర్తి<br>ఉత్తరాషాఢ 15:15<br>వ 19:35 to 21:19 | **8**<br>శు ఏకాదశి 13:55<br>రేవతి 7:02<br>వర్జ్యం లేదు | **15**<br>బ తదియ 12:41<br>పునర్వసు 10:31<br>వ 18:10 to 19:41 | **22**<br>బ ఏకాదశి 20:55<br>చిత్ర 1:21<br>వ 6:41 to 8:13 | **29**<br>శు తదియ 17:45<br>ఉత్తరాషాఢ 0:17<br>వ 4:34 to 6:17 |
| **MON**<br>R - 7:30 to 9:30 | **2**<br>శు పంచమి 0:43<br>శ్రవణం 17:17<br>వ 21:42 to 23:28 | **9**<br>శు ద్వాదశి 15:19<br>అశ్వని9:03<br>వ 4:42 to 6:26<br>వ 19:14 to 20:56 | **16**<br>బ చవితి 10:56<br>పుష్యమి 9:26<br>వ 21:37 to 23:09 | **23**<br>బ ద్వాదశి 19:13<br>స్వాతి 0:14<br>విశాఖ 23:13<br>వ 5:36 to 7:08 | **30**<br>శు చవితి 19:21<br>శ్రవణం 2:02<br>వ 6:24 to 8:09 |
| **TUE**<br>R - 15:00 to 16:30 | **3**<br>శు షష్ఠి 2:27<br>ధనిష్ఠ 19:48<br>వర్జ్యం లేదు | **10**<br>శు త్రయోదశి 16:11<br>భరణి 10:31<br>వ 23:02 to 0:42 | **17**<br>బ పంచమి 9:01<br>ఆశ్లేష 8:17<br>వ 19:36 to 21:06 | **24**<br>బ త్రయోదశి 17:46<br>అనూరాధ 22:30<br>వ 3:06 to 4:39 | **31**<br>శు పంచమి 16:00<br>ధనిష్ఠ పూర్తి<br>వర్జ్యం 12:18 to 14:05 |
| **WED**<br>R - 12:00 to 13:30 | **4**<br>శు సప్తమి 4:44<br>శతభిషం 22:45 వ 3:53 to 5:41 | **11**<br>శు చతుర్దశి 16:30<br>కృత్తిక 11:33<br>వర్జ్యం లేదు | **18**<br>బ షష్ఠి 7:01<br>మఖ 6:55<br>వ 14:26 to 15:56 | **25**<br>బ చతుర్దశి 16:46<br>జ్యేష్ఠ 22:15<br>వ 4:02 to 5:37 | **పండుగలు/శెలవులు**<br>**2** – సుబ్రహ్మణ్య షష్ఠి<br>**16** – ధనుర్మాసం<br>25 - Christmas<br>26 – Boxing Day |
| **THU**<br>R - 13:30 to 15:00 | **5**<br>శు అష్టమి 7:13<br>పూర్వాభద్ర పూర్తి<br>వ 5:56 to 7:43 | **12** ●<br>శు పూర్ణిమ 16:12<br>రోహిణి 11:54<br>వ 3:47 to 5:24<br>వ 17:28 to 19:04 | **19**<br>బ సప్తమి 4:56<br>పుబ్బ 5:28<br>వ 12:16 to 13:47 | **26** ●<br>బ అమావాస్య 16:12 మూల 22:21<br>వ 20:45 to 22:21 | **Sydney**<br>**Sun Rise Set**<br>1 5:38 19:50<br>8 5:38 19:55<br>15 5:39 20:01<br>22 5:42 20:04<br>29 5:46 20:07 |
| **FRI**<br>R - 10:30 to 12:00 | **6**<br>శు నవమి 9:44<br>పూర్వాభద్ర 1:40<br>వ 12:22 to 14:10 | **13**<br>బ పాడ్యమి 15:20<br>మృగశిర 11:47<br>వ 20:02 to 21:37 | **20**<br>బ అష్టమి 2:51<br>ఉత్తర 4:07<br>వ 12:01 to 13:32 | **27** పుష్యం<br>శు పాడ్యమి 16:06<br>పూర్వాషాఢ 22:58<br>వ 8:12 to 9:50 | **Melbourne**<br>**Sun Rise Set**<br>1 5:53 20:25<br>8 5:52 20:31<br>15 5:53 20:37<br>22 5:56 20:41<br>29 6:00 20:43 |
| **SAT**<br>R - 09:00 to 10:30 | **7**<br>శు దశమి 11:56<br>ఉత్తరాభద్ర 4:26<br>వ 17:44 to 19:31 | **14**<br>బ విదియ 14:13<br>ఆరుద్ర 11:22<br>వ 22:57 to 0:29 | **21**<br>బ నవమి 0:48<br>బ దశమి 22:47<br>హస్త 2:42<br>వ 10:15 to 11:45 | **28**<br>శు విదియ 16:32<br>ఉత్తరాషాఢ పూర్తి<br>వ 7:25 to 9:06 | **School Holidays**<br>NSW 21 Dec – 3 Feb '20<br>VIC 21 Dec –28 Jan '20 |

Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)

# "బంగారి గాజులు"

– శ్రీ ఆలూరి పార్థసారథి, చెన్నై/సిడ్నీ

"ఏమిటంత తెగని సమస్య! నాతో చెప్పకూడదా? ఒక్క సుఖంలోనే కాదు, కష్టంలో కూడా మీకు భాగస్వామిని నేను. ఏదైనా సరే, ఈరోజునుంచి మనమిద్దరం పంచుకోవాల్సిందే!' నిజాయితీగా అంది అరుణ ఆదిత్యవైపు ఒత్తిగిల్లుతూ.

అంతవరకు అరుణ చేతికున్న బంగారు గాజుల్ని పైకీ కిందికీ సర్దుతూ దీర్ఘాలోచనలోవున్న ఆదిత్య, ఆమె మాటలకి ఈలోకంలోకి వచ్చాడు. గాజులాట ఆపేశాడు. ఆమె చేతిని వదిలేశాడు. గుండెల్నిండా శ్వాస పీల్చి దీర్ఘంగా నిట్టూర్చాడు. 'అది బంగారు గాజుల కథ, నీకెలా చెప్పాలా అనే ఇన్నాళ్ళు సతమతమవుతున్నాను. సరే! ఒక కథలా చెప్తాను. విని, ఈ సమస్య తెగేదెలాగో నువ్వే చెప్పు.' అని మొదలెట్టాడు.

"కొండలరావు ఒక చిరుద్యోగి. బంగారులక్ష్మి ఒక నిరుద్యోగి. అతడికో తోడు కావాలి. ఆమెకో నీడ కావాలి. ఇద్దరి కుటుంబాలు అంతంతమాత్రమే. అయితే మాత్రం, 'సమాన వియ్యం సమాన కయ్యం' అన్నారు ఎరిగిన వాళ్ళంతా. ఇకనేం, తలా ఒక చెయ్యి వేసి కళ్యాణం కాస్తా అయిందనిపించారు. పాణిగ్రహణప్పుడు చూశాడు – ఆమె చేతిని. 'ఎంత సున్నితంగా సుకుమారంగా అందంగా ఉందో!' అనుకున్నాడు. అదే సమయంలో ఆమె చేతికున్న మామూలు గాజుల్ని చూసి మనసు చివుక్కుమంది అతడికి. 'ఆ చేతుల్ని అలంకరించే అర్హత, బంగారు గాజులకి తప్ప మామూలు గాజులకి లేదు. బంగారువైతేనే ఆ అందానికి తగిన న్యాయం చేసినట్టవుతుంది' అనుకున్నాడు. అనుకోవడమే తడవు ఎట్లాగైనా త్వరలోనే ఆమెకి 'బంగారు గాజులు' చేయించాలని సంకల్పించాడు. 'ఈ చేతికో అరడజను, ఆ చేతికో అరడజను – కనీసం నాలుగు-నాలుగు' అని. అలా పాణిగ్రహణమప్పట్నుంచీ ఒకటే ఆలోచన – 'బంగారు గాజులు చేయించాలి! ఎలాగైనా నా బంగారికి బంగారు గాజులు చేయించాలి' అని. ఎంతకీ కుదుటపడ్డంలేదు అతడి మనసు.

ఆరోజు రానే వచ్చింది, పాణిగ్రహణం తర్వాతి రోజు. ఎన్నాళ్ళనుంచో ఇద్దరూ ఎదురు చూస్తున్న రోజు. అతడు-ఆమె, మొట్టమొదటిసారి ఏకాంతంగా గడిపే రోజు. ఎన్నో ఊసులు కలబోసుకుని తమ సరికొత్త జీవితానికి శ్రీకారం చుట్టే రోజు. అప్పుడు చిక్కింది సమయం అతడికి; ఆమెతో తన కళ్ళలోని కలల్నీ, మనసులోని భావాల్నీ వ్యక్తం చేయడానికి. సుతారంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని, ఆమె చేతి గాజుల్ని అటుయిటూ కదుపుతూ ఆ గలగలల నేపథ్యంలో 'అవే బంగారు గాజులైతే' అని వాటి రవళిని ఊహించుకుంటూ ఆ నిక్వణాలకి మైమరచి తన బలమైన కోరికను బహిర్గతం చేశాడు. 'ఇంత అందమైన చేతులకి ఉండాల్సింది బంగారు గాజులు – ఎలాగైనా బంగారీ, నీకు బంగారు గాజులు చేయిస్తాను, నెక్స్ట్ పెళ్లిరోజులోగా'.

తాహతుకు మించి అతడు, తనకోసం అంత మొత్తం ఖర్చు చేస్తాననడంతో గుండె లయ తప్పినట్టయింది బంగారికి. 'నామీద ఎంత ప్రేమో!' అని ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవయ్యాయి. గబుక్కున తలెత్తి అతడి కళ్లలోకి చూసింది. కళ్ళూ కళ్ళూ కలిశాయి. బిడియంతో చటుక్కున తల దించుకుంది. మునివేళ్ళవైపు చూడసాగింది. "నమ్మశక్యంగా లేదా?" అన్నాడు కొండలరావు దెబ్బ తిన్నట్టుగా.

బంగారులక్ష్మి ఆ మాటకి బెదిరిపోయింది. అసంకల్పితంగా తన చేతితో అతడి నోటిని సుకుమారంగా మూస్తూ “అంత మాటనకండి! మీ ఈ ప్రేమ చాలు నాకు, జీవితాంతం సుఖంగా ఉండడానికి. నాకే బంగారమూ అక్కర్లేదు. మీరే నా బంగారం. నా బంగారు కొండ” అంది.

అలా కొండలరావు ‘బంగారి కొండ’ అయిపోయాడు. బంగారులక్ష్మి ‘కొండ బంగారి’ అయిపోయింది. ఒకరిలో ఒకరు ఐక్యమైపోయారు.

బంగారి కాపురానికి వస్తూనే – అడుగడుక్కీ మరమ్మత్తులు కోరే పాతకాలంనాటి ఇల్లే అయినా, అమ్మమ్మగారి ఇల్లనీ, స్వంత ఇల్లనీ, అద్దె కట్టక్కర్లేదనీ, వసతికేం ఇబ్బందిలేదు కానీ, ఱెక్కాడితే గాని డొక్కాడదని గ్రహించింది. మరిది హైస్కూలు ఆపైన కాలేజీ చదువు. ఆడపడుచుక్కూడా కనీస చదువు ఆపైన పెళ్లి – అధమాధమం ఈమాత్రమైనా సాధించాలంటే పేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా తను కూడా సాయపడాలనీ లేకపోతే చిరుద్యోగికి జీవనసమస్య అనీ, తన తోడుకి తనో గుదిబండలా కాక అండలా ఉండాలనీ, చల్లనినీడలా సేదదీర్చాలనీ, చక్కటి గృహిణిగా గుట్టుగా సంసారం నెట్టుకురావాలనీ, ఆర్థికంగా కూడా నిలదొక్కుకోవాలనీ ఆరోజే కంకణం కట్టుకుంది, అదనపు బాధ్యతలని ఆనందంగా పైన వేసుకుని ఆయింటితో పెనవేసుకుపోయింది.

ముందస్తుగా, అస్తవ్యస్తంగా ఉన్న ఇంటిని ఒక కొలిక్కి తెచ్చింది. ‘ఒక వస్తువుకి ఒక స్థలం, ఒక స్థలానికి ఒక వస్తువు’ కేటాయించి అందరికీ తెలియపరిచింది. అందరి దినచర్యలలో నిర్దిష్టతతో పనులు జరిగేలా, క్రమశిక్షణతో అందరూ మెసిలేలా తోడ్పడింది. ‘ఇంటికి అందం ఇల్లాలే’ అని అందరూ మెచ్చుకునేలా ఇంటిని తీర్చిదిద్దింది.

రోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట మరిదినీ ఆడపడుచునీ దగ్గరుండి చదివించేది. దాంతో వారిద్దరూ మంచి మార్కులు తెచ్చుకుని త్వరలోనే మంచి విద్యార్థులుగా పేరు తెచ్చుకున్నారు. అది ఆమెకీ పేరు తెచ్చింది. ఇరుగుపొరుగువారు, వారి పిల్లల్ని కూడా చదివించమని కోరడంతో ఆనందంగా అంగీకరించింది. వారిచ్చిన పారితోషికం మొహమాటపడకుండా తీసుకునేది. అలా కొండకి చేదోడువాదోడైంది.

‘బంగారికి ఇంకా గాజులు చేయించలేకపోయానే! ఎప్పటికి తీర్చుకుంటాను నేనన్న మాట’ అని మనసు కలచివేసినప్పుడల్లా అదోలా అయిపోయేవాడు కొండలరావు. అతడేం చెప్పకపోయినా, ఇట్టే గ్రహించే సేది బంగారి. దగ్గర చేరి, ఊరడించేది. ‘మీరలా బెంగ పెట్టుకోకండి, మనకి అవసరాలని మించి ఆదాయం ఉన్నప్పుడు, దూబరా ఖర్చుల గురించి ఆలోచిద్దాం. అంతవరకు ఒక ఉద్యమంలా పొదుపు చేద్దాం. తప్పనిసరయితే తప్ప రాకపోకలు, ప్రయాణాలు చెయ్యొద్దు. విందులని వినోదాలని వృథా చేయొద్దు. మీరెక్కడ ఉంటే అదే నాకు స్వర్గం. మన ఇల్లే ఒక నందనవనం!’ అని నచ్చచేప్పేది. అతడి దిగులు పోగొట్టేది. అలా ఒక ఉద్యమంలా పొదుపు చేసింది. అయినా అతడి బంగారు గాజులకు ప్రాముఖ్యతగాని ప్రాధాన్యత గానీ ఇవ్వలేదు. ఇవ్వనీయలేదు ఆమె.

అలా వారి ప్రేమలో రోజులు మరచిపోయారు. కొండ కోరిక ఇంకా కొండెక్కలేదు. ఎన్ని అవకాశాలొచ్చినా బంగారి, వేరే ఏదో ఖర్చు దానికంటే అవసరమైనదని కొండని ఒప్పించి, ఆ డబ్బు ఇంకోలా ఖర్చు చేసిందే కాని అతడి మాట కానివ్వలే, కోరిక తీరనివ్వలే.

ఈలోగా ఎందరో ప్రధానులు మారారు. కొండలరావు కోరిక కూడా పంచవర్ష ప్రణాళికల్లో వెయ్యడమే గాని సాధించడం కుదరలేదు. పప్పులు-ఉప్పులు అన్ని నిత్యావసర వస్తువులతో పాటు ఎన్నేళ్ళనుంచో అతడు మమకారం పెంచుకున్న అతి ప్రియమైన మెటల్ 'బంగారం' అతడికి ప్రియమైపోయింది. మార్కెట్లో అన్నిటి విలువ వాటి ఒకప్పటి విలువకంటే ఎన్నో రెట్లు పెరిగిపోయింది, ఒక్క అతడిలాంటి సామాన్యుడి సేవల విలువ తప్ప. కొండలరావు అది అతిసహజంగా తీసుకున్నాడు. జీతానికీ జీవితానికీ ముడిపెట్టలేదు. దేని దారి దానిదే అని సర్దుకుపోయాడు. అలాగే నెట్టుకొస్తున్నాడు. అందుకే, తన జీతం అన్ని రెట్లు పెరగలేదని ఎప్పుడూ వాపోలేదు. 'ఏం? ఎందుకా వ్యత్యాసం?' అని అతడెవరినీ నిలదియ్యలేదు. ఎవరితోనూ ఫిర్యాదు చెయ్యలేదు. మనదేశ సభ్య సమాజ పౌరునిలా మౌనంగా ఋణభారాన్ని పెంచుకుంటూ సాగదీసేస్తున్నాడు. బంగారులక్ష్మి ఒక్కరోజైనా కంటతడి పెట్టలేదు, ధైర్యాన్ని విడనాడలేదు. కొండకి కొండంత అండగా నిలచింది."

*****************************************************************

అలా ఆదిత్య ఆగకుండా బంగారి గాజుల కథకి బదులు, బంగారి జీవితచరిత్ర చెబుతూవుంటే అరుణ 'ఈకథ మాకథ కాదు, మరి తనకా కథ ఎందుకు చెబుతున్నాడు? ఈకథకీ ఆదిత్యకీ నాకూ ఏమిటి సంబంధం?' అనుకుంది. అలా అనుకున్నదే తడవు, అరుణకి బంగారి ఎవరైవుండొచ్చో తట్టింది. ఒకే ఒక్క క్షణం తటపటాయించింది. కుతూహలాన్ని ఆపుకోలేక అడిగేసింది – "అక్కయ్యగారి గురించి కదా చెబుతున్నారు" అని.

'అవును!' అన్నట్టు నిటారుగా తల ఊపాడు.

'అయితే పేర్లు మార్చి ఎందుకు చెబుతున్నారూ!' అంది ఆశ్చర్యపోతూ.

"మా అన్నయ్య వదిన వాళ్ళ గురించే అని ముందరే చెప్తే, నిష్పక్షపాతంగా ఆలోచించలేవేమో! సరైన సలహా ఇవ్వలేవేమో!' అనిపించింది. అయినా పోల్చేశావుగా, యు ఆర్ క్లవర్!" అని తిరిగి చెప్పనారంభించాడు.

"అన్నయ్య పెళ్లయి వదిన మాయింటికి వచ్చేసరికి నేను చాలా చిన్నవాణ్ణి. అమ్మ ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. వదిన కొంగు వదిలేవాణ్ణి కాదు నేను. అప్పుడే నాకు మా అన్నయ్య కోరిక తెలిసింది. అన్నయ్య, బంగారం షాపువాడికి గాజులు చెయ్యమని పురమాయించొచ్చి నా ఎదురుగానే వదినతో గర్వంగా, 'ఇన్నాళ్టికి నా చిరకాల వాంఛ తీరింది. ఇప్పుడే ఆర్డర్ ఇచ్చి వస్తున్నాను. రేపు ఉదయమే పని మొదలెట్టి, సాయంత్రంలోగా గాజులు చేసి ఇచ్చేస్తానన్నాడు. రేపు సాయంత్రానికల్లా నీ అందమైన చేతులకు న్యాయం చేసినవాణ్ణవుతాను.' అన్నాడు.

వదిన ఆనందించలేదు. అన్నయ్య మీద అపరకాళిలా లేచింది. 'అత్తయ్యగారి ఆరోగ్యం అంతంత మాత్రంగావుంది. ఇప్పుడు గాజులు కావల్సివచ్చాయా నాకు. అన్నేసి వేలు పెట్టి కొనాల్సిన అవసరమేమొచ్చింది. అయినా నాకు తెలీకుండా డబ్బులెక్కడనుంచొచ్చాయి మీకు?' అని కడిగేసింది. అన్నయ్య నీరు కారిపోయాడు. కొద్దిసేపట్లో తెప్పరిల్లి, మెల్లిగా చెప్పాడు – 'ఇన్‌స్టాల్‌మెంట్లలో ఇవ్వడానికి ఒక బంగారం షాపువాడు ఒప్పుకున్నాడు. నిజానికి గాజులు తెచ్చాకే నీకు సర్‌ప్రయిజ్ ఇద్దామనుకున్నాను. కానీ నిన్ను చూశాక ఏమీ దాచలేకపోయను' అని నసిగాడు, పాపం! వదిన మనసు కరిగింది. అన్నయ్యమీద జాలి కలిగింది.

నన్ను దగ్గరకి తీసుకుంది. నా తల నిమురుతూ అన్నయ్యతో చెప్పింది. 'సారీ! మీ మనసు కష్టపెట్టాను కదూ! పాపిష్టిదాన్ని! ఏం చెయ్యను, మన ఆడంబరాలకు ఆభరణాలకూ ప్రాధాన్యతనివ్వటానికి ఇది సరైన టైము కాదనిపిస్తోంది నాకు. ముందు పిల్లల చదువులు అవీ ఒక్కొక్కటీ కానీండి. తరవాత ఆలోచిద్దాం. ఇప్పుడే షాపువాడి దగ్గరకి వెళ్లి ఆర్డర్ కాన్సిల్ చేసి రండి. వాడు మరీ ఒత్తిడి చేస్తే, మజూరీ డబ్బులో మరోటో ఎంతో కొంత తీసుకోమనండి. ఎలాగోలా ఇక్కడితో సెటిల్ చేసి రండి. అంతేకాని, మనకిప్పుడీ సింగారాలొద్దు, ప్లీజ్!' అని బుజ్జగించింది. అన్నయ్య మొహం వేలాడేసుకుని వెనక్కి తిరిగి బజారుకి బయల్దేరాడు.

అప్పట్లోనే ఒక సాయంత్రం నేనూ, అక్కా స్కూలునుంచి వచ్చాక, వదిన ప్రక్కింట్లో పేరంటానికని వెళ్ళింది. అప్పుడు అమ్మ, మా ఇద్దర్నీ దగ్గరకి పిలిచింది. ముక్కుతూ మూలుగుతూ మంచంమీద పడుకునే, మాకు చాలా విషయాలు చెప్పింది. అన్నయ్యా వదినల గురించి చెబుతూ మధ్యమధ్యలో చేతులెత్తి దణ్ణం పెట్టింది. వదినని దేవతంది. భూదేవంది. అన్నయ్యని ఉత్తముడంది. అలాంటి కొడుక్కి తల్లినవడం ఏజన్మలోనో చేసుకున్న పుణ్యం అంది. వారి మనసుకెప్పుడూ కష్టం కలిగించకుండా మెసులుకోమని చెప్పింది.

నేను అన్నీ శ్రద్ధగా విన్నాను. భూదేవితో వదినని ఎందుకు పోల్చిందో నాకప్పుడు అర్థంకాలేదు. అమ్మ మాట్లాడుతున్నంతసేపు అక్క వలవలా ఏడ్చింది. 'నీకేం కాదు అమ్మా! నువ్వూరుకో, ధైర్యం తెచ్చుకో' అంది. వెక్కిళ్ళ మధ్యే, 'నువ్వు చెప్పినట్టే వింటాం! అన్నయ్యా వదినల మాట జవదాటం, వాళ్లకి కష్టం తెప్పించం.' అని మాట ఇచ్చింది.

అప్పుడే నాకు మొదటిసారి ఒక రహస్యం తెలిసింది. అది మా అమ్మ చెప్పింది. అయితే ఆ రహస్యం నాకు తెలిసినట్టుగా మా వదినతోగానీ అన్నయ్యతోగానీ ఈరోజువరకు ప్రవర్తించలేదు. అ ప్రస్తావనే మా మాటల్లో రాకుండా ఇన్నాళ్ళూ జాగ్రత్తపడ్డాం. వస్తే వాళ్ళు చాలా బాధపడతారు. అది మేముంటున్న ఇంటి సంగతి.

'ఈ ఇల్లు అమ్మమ్మా వాళ్ళదే! కానీ మా అమ్మమ్మా వాళ్ళదీ కాదుట. అన్నయ్యా వాళ్ళ అమ్మమ్మదిట. మా నాన్నగారిక్కాని అమ్మావాళ్ళకి కానీ ఆస్తిపాస్తులేవీ లేవుట. ఆమాత్రం నిలవనీడైనా దక్కింది మహాసాధ్వి అయిన అన్నయ్యా వాళ్ళ అమ్మ వల్లట" అని ఆదిత్య చెబుతుంటే ఆసక్తిగా వింటున్న అరుణ చలించిపోయింది. భావోద్వేగంలో కొట్టుకుపోయింది.

'స్వంత వాళ్లని కూడా లెక్కచెయ్యకుండా పాతికవేల కోసం ప్రాణాలు తీసేవాళ్లని, పొలంకోసం పొడిచేసేవాళ్లని, స్వార్థం కోసం దేశాన్నే పణంగా పెట్టే దౌర్భాగ్యుల్నీ చూస్తున్న ఈరోజుల్లో సవతి తల్లి పిల్లలకోసం త్యాగం చేసే బావగారిలాంటి అన్నయ్యలున్నారంటే నమ్మశక్యంగా లేదు ! అలాంటిది, వారి బాధ్యతల్ని సహితం తనవిగా చేసుకుని పరాయివారిని కూడా స్వంతవాళ్లకంటే ఎక్కువగా ఆదరించే అక్కయ్యగారిలాంటి వాళ్లు మనదేశంలో ఇంకా ఉన్నారంటే నాకు ఏం చెప్పాలో తెలియటం లేదు' అని "తరవాతేమైంది పూర్తిగా చెప్పండి" అంది.

"ఆ మర్నాడు ఉదయం అందరూ ఏడుస్తూంటే తెలిసింది, అమ్మ పోయిందని. అలా ఒకదాని తర్వాత ఒకటి ఏవో అవాంతరాలు, ఏవో ఖర్చులు. ఒకరోజు భోజనాల దగ్గర వదినే అన్నయ్యతో బంగారం విషయం ఎత్తింది. 'ఏమండీ! మీతో ఒక విషయం చెప్పాలండీ' అంది. 'చెప్పు' అన్నాడు అన్నయ్య. 'మీరు అనుమతిస్తే బంగారం కొందాం' అంది. 'దానికేం మహాభాగ్యం, నువ్వెలా అంటే అలాగే! ప్లానింగంతా నీదేగాగ చెప్పు, ఇంతకీ ఏంటి కొనాలిట. జడగంటలా, పాపిడిపిందెలా?' అన్నాడు.

దానికి వదిన, 'అవిప్పుడెవరూ పెట్టుకోవడం లేదు. పెట్టుకున్నా ఆర్టిఫిషియల్‌వి పెట్టుకుంటున్నారు. అది కూడా ఆ సందర్భానికి మాత్రమే పెట్టుకుని తర్వాత ప్రక్కన పడేస్తారు. అదే ఓ మోస్తరు చెయిన్ అయితే బాగుంటుంది. దానికి తగ్గ లాకెట్టుంటే ఇంకా బాగుంటుంది. రోజూ వేసుకోవచ్చు. కాళ్లు కడిగి కన్యాదానం చేస్తున్నప్పుడు మెడ మరీ బోసిగా ఉంటే మనకే చులకన. అత్తయ్యగారి బంగారంతో చెవులకీ ముక్కుకీ చేయించాం. కనీసం ఈ చెయినైనా చేయిస్తే మన పరువు నిలుస్తుంది. లేకపోతే పెళ్లికొచ్చిన వాళ్లు మనల్ని పిల్లాజెల్లా కూడా లేరు, ఎవరికి పెడతారు? పోయాక ఉట్టికట్టుకుంటారా? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు పెడతారు బంగారం! మరీ ఇంత లేకివాళ్ళనుకోలేదు అని నానా మాటలు అంటారు' అంది.

వదిన ఎవరికోసం బంగారం కొనమంటోందో, అక్కకి అప్పటికర్థమైంది కాబోలు; జలజలా కన్నీటిబొట్లు కంచంలో పడి మజ్జిగాన్నంలో కలిసిపోయాయి. ప్రక్కనే కూర్చున్న అన్నయ్య, అక్క తలపై ఆప్యాయంగా రాస్తూ 'పిచ్చిపిల్లా' అన్నాడు.

ఇక అక్కయ్య పెళ్లి – చదువు మీద శ్రద్ధ చూపిస్తుండడంతో గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ అని కొంతా, మాకు స్తోమత లేక కొంతా జాప్యం జరిగింది. అక్కయ్య పెళ్ళికి ఖర్చు బాగానే అయింది. తర్వాత, అక్కయ్య పురిటికి వచ్చింది. అప్పుడే ఒకరోజు మాటల్లో అక్కయ్య, నాతో 'జన్మనిచ్చిన తండ్రిగా నాన్న నాకు గుర్తే, కానీ నాన్న అనే మాటకి మనసులో మెదిలే రూపం మాత్రం అన్నయ్యదే! అన్నయ్యని తలుచుకున్నప్పుడల్లా వదిన గుర్తొస్తుంది. వదినని తలచుకున్నప్పుడల్లా స్పందనతో గుండె బరువెక్కుతుంది. ఆమె ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ! ఆమె ఒక అద్భుతం! ఆమె నాకు ఆదర్శం! ఆమె స్వభావ లక్షణాల్లో కొంచెమైనా నాకు రావాలని, ఆమెలా ఆలోచించి ప్రవర్తించగలిగే హృదయాన్నివ్వమనీ నేను రోజూ దేవుణ్ణి ప్రార్థిస్తాను.' అంది.

అలా అక్కయ్య చెబుతుంటే నాకు కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి. 'ఏ ఆడపడుచూ తమ వదినతో ఇంతలా ప్రభావితం అవదేమో! ఇంతలా తమ వదిన గురించి చెప్పదేమో! అంత గొప్ప వ్యక్తి మా వదిన' అనిపించింది నాకారోజు.

అలాంటి మా వదినకి చాలా సంవత్సరాల క్రితం ఒక చిన్న కానుక ఇద్దామనుకున్నాడు మా అన్నయ్య. ఇంకా అతడి కోరిక తీరలేదు. ఇక నా సంగతి నీకు తెలిసిందే! ఈమధ్యే చదువు పూర్తిచేసుకుని ఉద్యోగంలో చేరాను. ఇప్పుడే నాకు ఇంటి మీద అప్పుందని తెలిసింది. సముద్రం ఒడ్డున నిలబడి కెరటాల తాకిడి తగ్గాలని చూస్తున్నాడు అన్నయ్య. ఇక మా మంచి దేవతలాంటి వదినకి గాజులెప్పుడు చేయిస్తాడో" అని ఆదిత్య ముగించాడు.

అరుణ, ఆదిత్య మొహంలోకి చూస్తూ, తోటికోడలు గురించీ బావగారి గురించీ వింటూ లీనమైపోయిందేమో, అతడు చటుక్కున చెప్పడం ఆపేసరికల్లా స్తబ్దుగా అయిపోయింది. రెండు క్షణాల్లో తేరుకుంది. తనదైన బాణీలో స్పందించింది - "ఆదిత్యా నువ్వేం అనుకోకపోతే ఒకమాట చెప్తాను" అని.

అతడి అనుమతి కోసం ఆగకుండా చెప్పనారంభించింది.

"అక్కయ్యగారే మన పెళ్లికి ముందు, 'మగపెళ్లి వారు బంగారం ఏమీ పెట్టకపోతే అమర్యాదగావుంటుంది' అని పట్టుబట్టి నాకోసం బంగారు గాజులు చేయించారని చెప్పావు. అవి అక్కయ్యగారికిచ్చేస్తే బాగుంటుంది. కానీ అలా చేస్తే అది ఆవిడని అవమానించినట్టుంటుంది. నీ సంపాదనతో నువ్వు చేయించి ఇస్తే బాగుంటుంది అనుకుంటే, అది మీ అన్నయ్యగార్ని అవమానించినట్టవుతుంది. ఇక్కడ ఎలాగైనా మనం సాధించవలసింది, అక్కయ్యగారి కోసం బంగారుగాజులు కాదు. ఆ గాజులు బావగారు చేయించడం. అదీ సరైనది. అదే ముఖ్యం.

ఒక పని చేద్దాం! ఇకమీదట ఒక విషయంలో మీ అన్నయ్యగారి మాటగాని వదినగారి మాటగాని వినొద్దు. మీ జీతం అంతా తీసుకొచ్చి మీ వదినగారికే ఇవ్వండి. అన్నదమ్ములిద్దరూ ఫుల్ టైమ్ పనిచేసి ఆర్జించి తెస్తారు. అక్కచెల్లెళ్లిద్దరం చేయగలిగింది చేస్తాం. ఒకరికొకరం తోడు. మన బలం రెట్టింపవుతుంది. ఇప్పటివరకు ఇల్లెలా నడుపుతున్నారో

అలాగే నడపమనండి. భేషజాలు వద్దు. వాళ్లు నడచిన బాటనే మనం కూడా పొదుపుగా నడిచామంటే కొద్దిరోజుల్లోనే ఇంటిమీద అప్పు తీరిపోతుంది. అప్పుడు మీ అన్నయ్యగారి కోరిక సఫలమవుతుంది" అంది.

"కరణేషు మంత్రి అని కూడా అనిపించుకున్నావ్, శభాష్! మా వదినకు తగ్గ చెల్లెలివే" అంటూ ఆదిత్య మురిసిపోయాడు.

కాలం గిర్రున తిరిగిపోయింది. ఆరు ఋతువులు గిరగిర తిరిగిపోతున్నాయి. అప్పులు తీరిపోయాయి. ఇంకా ఉద్యోగాలు చేస్తూనే ఉన్నారు, ఆర్జిస్తూనేవున్నారు. అయినా వదిన చేతికి గాజులు మాత్రం రావట్లేదు.

ఒకరోజు ఆదిత్య సమయం చూసుకుని, సంశయిస్తూనే అన్నయ్యతో ఆవిషయం కదిపాడు. "అన్నయ్యా! మనకింక ఏ ఆర్థిక ఇబ్బందులు లేవు కదా, ఇంకా ఎందుకు ఆలస్యం? వదినకి ఎప్పటినుంచో బంగారుగాజులు చేయిద్దామనుకున్నావు కదా, ఇప్పుడు చేయించొచ్చు కదా" అని.

అతడు చిన్న స్మైల్ ఇచ్చి, "నువ్వన్నది నిజమే! మొదట్లో చాలాసార్లు బంగారుగాజులకి మాత్రమే మీ వదిన చేతుల్నలంకరించే అర్హత ఉందని వాటికోసం తపించాను. కానీ తర్వాత అర్థమైంది – మీ వదినే ఒక అపరంజి బొమ్మ, అమృతమూర్తి. అలాంటి అమృతమూర్తికి ఆభరణాల్ని మనం తొడగాలనుకోవడం - భగవంతుడు సృష్టించిన పుష్పాల్ని భగవంతుడికే అర్పించి భక్తుడు తృప్తి పొందడం లాంటిదని. భగవంతుడు ఎప్పుడూ ఏదీ కోరడు. నిజానికి అక్కరలేదు. నాకు మీ వదిన మీద ఉన్నది ప్రేమ కాదు, భక్తి! భక్తుడు చేయగలిగేది పూజే! అలాంటి పూజకు హృదయపుష్పాల్ని మించిన పుష్పం వేరే ఏముంది? ఆఫ్టరాల్ బంగారానికి అంత అందలమెక్కే యోగ్యత లేదు." అని చెప్పి అక్కడ్నించి కదిలాడు.

ఆభరణాలకన్నా మిన్న ఆదర్శాలనీ, అపరంజి కన్నా వన్నె అమృతహృదయాలదనీ, ఆచరణలో తెలిపి ముందుకు సాగిపోతున్న అన్నవైపు ఓ అద్భుతాన్ని చూస్తున్నట్టు చూస్తూ ఉండిపోయాడు ఆదిత్య.

('ఆంధ్రభూమి' కథల పోటీలో ఎన్నికై 06/01/2011 వారపత్రికలో ప్రచురించబడింది.)

❖❖❖❖❖



# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ



గత సంచికలోని మేళకర్త రాగాల వివరణ కొనసాగిస్తూ ఇప్పటి వరకూ మనం 72 మేళకర్తలూ 12 చక్రాలలో ఎలా అమర్చ బడ్డాయో, ఆ 12 చక్రాల పేర్లు మరియు ఇతర వివరాలను తెలుసు కున్నాం. ఈ 12 లో మొదటి 6 శుద్ధ మధ్యమం తక్కిన 6 చక్రాలు ప్రతి మధ్యమం కలిగి ఉన్నాయి కనుక పూర్వ మేళ కర్తలను ఉత్తర మేళకర్తలనుండి విభజిస్తోంది కనుక 'మధ్యమం' అంటే 'సరిగమపదని' లో 'మ' అనే స్వరాన్ని బై సెక్టింగ్ లైన్ గా పేర్కొంటారు. ఇక ఇప్పుడు ఈమేళకర్తల విభజన పథకంలో 16 స్వరస్థానాలనూ ఎలా వాడారో చూద్దాం. మొదటగా ఈ 16 స్థానాలకు ఈక్రిందివిధంగా సాంకేతిక నామాలను ఇచ్చారు.

స (ప్రకృతి స్వరం)

ర,రి,రు (R1,R2,R3)

గ, గి, గు (G1, G2, G3)

మ, మి (M1, M2)

ప (ప్రకృతి స్వరం)

ద, ది, దు( D1, D2, D3)

న, ని, ను ( N1, N2, N3)

ఇక ఈ పైనపేర్కొన్న భేదాలలో మధ్యమం ప్రతి 6 చక్రాలకీ మారు తుంది. ఇక తరువాత రిషభ, గాంధారాలకు ప్రతి చక్రానికి మారుతాయి. అనగా

శుద్ధ మధ్యమం. ప్రతి మధ్యమం

1) ఇందు చక్రం. —— ర, గ. —— 7) ఋషి చక్రం

2) నేత్ర చక్రం. —— ర, గి. —- 8) వయసు చక్రం

3) అగ్ని చక్రం. —— ర, గు. — 9) బ్రహ్మ చక్రం

4) వేద చక్రం —— రి, గి. —- 10) దిశి చక్రం

5) బాణ చక్రం —— రి, గు. —- 11) రుద్ర చక్రం

6) ఋతు చక్రం —— రు,గు —- 12) ఆదిత్య చక్రం

తరువాత దైవత నిషాదాలు ప్రతి రాగానికి మారుతాయి. ఇక ఒక్కొక్క చక్రంలో ఒక్కొక్క రాగానికి ఒక సాంకేతిక నామం ఉంది. ఆరకంగా దైవత నిషాదాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

సాంకేతిక నామం. స్వరస్థానాలు

ఒకటవ రాగం —- ప. —- ద, న

రెండవ రాగం. —- శ్రీ. —- ద, ని

మూడవరాగం. —- గో —- ద, ను

నాలుగవ రాగం. —- భు. —- ది, ని

ఐదవ రాగం. —- మ. —- ది, ను

ఆరవ రాగం. —- ష. —- దు, ను.

ఈ విభజనను అనుసరించి రాగాలకు సాంకేతిక నామాలను అమర్చారు. ఉదాహరణకు శంకరాభరణం రాగాన్ని తీసుకుంటే ఇది 72 మేళకర్తల క్రమంలో 29 వది. అలా ఈరాగం 5 వ చక్రమైన 'బాణ' చక్రంలో 5 సంఖ్య కలిగి ఉంది. ఏ చక్రంలో నయినా 5 రాగానికి వలసిన సాంకేతిక గుర్తు పైన వివరించిన 'ప శ్రీ గో భు మ ష' ల లో 'మ' అనే అక్షరం అవుతుంది కనుక శంకరాభరణ రాగం యొక్క సాంకేతిక నామం 'బాణ — మ'. అలాగే సాధారణం గా అందరూ అభ్యాస గానం అంటే సరళీస్వర, జంటస్వర ఇత్యాదులు పాడే మాయా మాళవగౌళ రాగం సాంకేతిక నామం 'అగ్ని - గో' అనగా 3వ చక్రమైన అగ్ని చక్రం లోని 3వ రాగం అన్న మాట.

అలాగే ఇప్పుడు మేళకర్త రాగాల వరుస సంఖ్య ఎలా కనుక్కోవాలో తెలుసుకుందాం. దీనికి మన సంగీతం లో 'కటపయాది' సంఖ్య అనే పద్ధతి ద్వారా తెలుసు కుంటారు. ఇందులో తెలుగు భాష లోని హల్లులను ఈ క్రింది విభాగాలుగా చేసి దాని నుండి వరుస సంఖ్య కనుక్కోవటం చాలా సులభం అన్న మాట. కనుక ఇప్పుడు ఆ విభాగా లు ఏమిటో చూద్దాం. హల్లులో మొదటి పైన 'క' అక్షరం నుండి 'ఞ' వరకూ గల 9 అక్షరాలను ' కాది నవకమంటారు. అలాగే తరువాత 'ట' నుంచి 'న' వరకూ గల 9 అక్షరాలను 'టాది నవకము' తరువాత 'ప' నుంచి 'మ' వరకూ గల 5 అక్షరాలను పాది పంచకమని ఇక మిగి లిన 'య' నుండి 'హ' వరకూ గల వాటిని యాద్యష్టకమని అంటారు.
మొత్తంగా ఈ పథకాన్ని 'క ట ప యాది' సంఖ్య అని పేర్కొన్నారు. దీన్ని తెలుగు ఛందస్సులోని 'యమాతారాజభానసలగం' అనే గణ పథకా నికి సరిపోల్చ వచ్చన్న మాట. (At the outset).

ఇక ఇప్పుడు ఈ పథకం ద్వారా కర్త రాగం యొక్క వరుస సంఖ్య ఎలా కనుక్కోవాలో చూద్దాం. ఉదాహరణకు మనం పైన చెప్పుకున్న మాయా మాళవగౌళ రాగ సంఖ్య చూద్దాం. ఈ పద్ధతికి కొన్ని నియమాలు ఉన్నా యి. మొదటి నియమం వరుస

సంఖ్య తెలుసుకొన వలసిన రాగం యొక్కపేరు లోని మొదటి 2 అక్షరాలు అక్షరాలు మాత్రమే తీసుకోవాలి.

కనుక పైన రాగం మొదటి 2 అక్షరాలు 'మ' , 'య' ఇందులో మ అనే అక్షరం పైన చెప్పుకొన్న 'పాది పంచకం' అనే గుచ్ఛం లోని 5 వ అక్షరం. ఇక 'య'అనే అక్షరం యాద్యష్టకంలోని 1వ అక్షరం కనుక మనకు వచ్చే సంఖ్య మ, య కు 51 కానీ, ఈ కటపయాది సూత్రం యొక్క ఇంకొక నియమం ఏమిటంటే ఈ వచ్చిన సంఖ్యను తిరగ వెయ్యాలి అంటే 51 ని తిరగ తిప్పితే 15 కదా కనుక మాయా మాళవగౌళ వరుస సంఖ్య 72 మేళకర్తల పథకంలో 15 వ మేళకర్త అన్న మాట.

ఇక ఈ పథకంలోని ఇంకొక నియమం ఏమిటంటే సంయుక్తాక్షరాలు ఉన్నప్పుడు సంయుక్తాక్షరంలోని రెండవ అక్షరాన్ని మాత్రమే పరిగణన లోకి తీసుకోవాలి. ఉదాహరణకి 'చక్రవాకం' అనే రాగ వరుస సంఖ్య తెలుసుకుందాం. చ అనే అక్షరం కాది నవకం అనే 9 లో 6 వ అక్షరం. ఇక రాగం పేరు లోని 2 వ అక్షరం 'క్రావడి మరియు క (క్ర) వీటిలోని 2 వ అక్షరం వరుస క్రమంలో పక్క పక్కన రాస్తే సంయుక్తాక్షరంలో 2వ అక్షరం 'క'. ఇక ఈ క అనే అక్షరం కాది నవకంలోని 1 వ అక్షరం అంటే మనకి వచ్చే సంఖ్య 61. దీనిని తిరగ రాస్తే 16 అంటే చక్రవాకం అనే రాగం 72 మేళకకర్తలలో 16 వ రాగం అన్న మాట.

ఇక ఇప్పుడు మనం ఎప్పుడూ చర్చించుకున్నట్లు కృతి పరిచయంలో త్యాగరాజస్వామివారి శుద్ధ సావేరి రాగంలోని ఒక అపురూప కృతి అయిన 'లక్షణములు గల' అనే కృతి గురించి తెలుసుకుందాం. ముందుగా ఈ కృతి సాహిత్యం పరిచయం చేసుకుందాం.

పల్లవి:

లక్షణములు గల శ్రీ రామునికి

ప్రదక్షిణ మొనరింతము రారే

అను పల్లవి:

కుక్షిని బ్రహ్మాండము లున్నవట వి

చక్షణుడట దీక్షా గురుడట శుభ. ||లక్షణములు గల||

చరణం:

లక్షణ లక్ష్యము గల శృతులకు ప్ర

త్యక్షంబౌ నట

శిక్షితుడై సభను మెప్పించు భక్త

రక్షకుండౌనట

అక్షరస్థులైన భజన పరులకే అంతరంగుడౌనట

సాక్షియై వెలయు త్యాగరాజ పక్షంబౌనట

ముప్పదిరెండు || లక్షణములు కల||

త్యాగరాజస్వామివారి కృతుల యొక్కఒక ముఖ్యమైన లక్షణం వెనకనుంచి ముందుకి చదివితే ఆయన యొక్క అంతరంగ మర్ధమౌ తుంది. అలా చూస్తే ఇక్కడ కృతికి ఆఖరి పదమయిన ముప్పై రెండు లక్షణములు కల శ్రీ రామునికి ప్రదక్షిణ

మొనరింతము రారే. అంటే ఇక్కడ మనకి ఉపమాలంకారం కన పడుతుంది.ఎలా అంటే చంద్రుడి అందానికి ఆయనక గల 32 కళలు అంటారు కదా అటువంటి అందమయిన 32 లక్షణములు కల రామునికి అని అన్వయించుకొనవచ్చు. ఇక అనుపల్లవి లో పైన చెప్పిన కొన్ని లక్షణాలలో కొన్ని కుక్షిని బ్రహ్మాండములున్నవట, విచక్షణుడట మరియు దీక్షా గురుడట అటువంటి శుభ లక్షణములు కల రాముడు అని. ఇక చరణంలో చక్కని శృతి జ్ఞానం కలిగి, భావ జ్ఞానం కలిగి, సాహిత్య జ్ఞానం కలిగి , భయ భక్తులు, సంగీత విచక్షణ గల భక్తులకు ఆయన ప్రత్యక్ష మౌనట ఇక అటువంటి భక్తికి నిదర్శనం త్యాగరాజ స్వామి యట కనుక ఆయన పూజించే 32 లక్షణములు కల రామునికి ప్రదక్షిణ చెయ్యాలట. కనుక అటువంటి రామునికి మరియు త్యాగరాజ స్వామి వారికి శత సహస్ర వందనాలతో ఇప్పటికి సెలవు.

అపురూపమైన త్యాగరాజవారి కీర్తన ఈ లింకు ద్వారా విని ఆస్వాదించండి.

https://www.youtube.com/watch?v=7GvFdMAPoCM

❖❖❖❖❖






❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282

❖❖❖❖❖


SoftLabs®
Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
· SOFTWARE TESTING
· PRE SALES ANALYSIS
· BUSINESS ANALYSIS
· AGILE TRAINING
CONSULTING SERVICES
· CONTRACT MANAGEMENT
· PAYROLL MANAGEMENT
· RESOURCE MANAGEMENT
· STAFFING
CONTACT: SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA

❖❖❖❖❖


Merry Christmas
& Happy Holidays!

❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


VINS
Taxation Services
SREENIVAS KUCHI
Registered Tax Agent & Accountant
Level 1, Suite 37
48-50 George Street
Parramatta NSW 2150
O: (02) 9893 7877
M: 0413 362 797
F: (02) 9893 9566
Email: kuchi@vinstax.com
www.vinstaxation.com.au


TaxNET
AUSTRALIA
Suit 7 Level 7,Strathfield Plz.
11 Boulevarde Pde
Strathfield, NSW 2135
Gopal K Gatiganti
Regd. Tax Agent
Ph: 9746 5858 Fax: 9746 5865
Mob: 0433 333 585
gopal@taxnetaustralia.com.au
www.taxnetaustralia.com.au


❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

**INDAUS IMMIGRATION**

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

తెలుగు బడి

Telugu Badi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School

**We provide:**

- Caring teachers
- Personal attention
- Attractive learning activities
- Outcomes based teaching

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2020 starting on Sun, 2-Feb-2020.

**Our Schools:**

- Strathfield South PS
- Hambledon PS (Quakers Hill)
- Darcy Rd PS (Wentworthville)
- Eastwood PS
- Beaumont Hills PS (Kellyville)

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,
Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org

# పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: ముత్యాలముగ్గు
సంగీతం: కె.వి. మహదేవన్
రచన: సి. నారాయణ రెడ్డి
పాడినవారు: పి. సుశీల

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ
ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ
ముద్దు మురిపాలలొలుకు ముంగిళ్ళలోన
మూడు పువ్వులు ఆరు కాయల్లు కాయ
ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ...

అరనైదోతనము ఏ చోట నుండు
అరుగులలికేవారి అరచేతనుండు
అరనైదోతనము ఏ చోట నుండు
అరుగులలికేవారి అరచేతనుండు
తీరైన సంపద ఎవరింటనుండు
తీరైన సంపద ఎవరింటనుండు
దిన దినము ముగ్గున్న లోగిళ్ళనుండు

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ

కోటలో తులిసెమ్మ కొలువున్న తీరు
కోరికొలిచేవారి కొంగుబంగారు
కోటలో తులిసెమ్మ కొలువున్న తీరు
కోరికొలిచేవారి కొంగుబంగారు
గోవుమాలక్ష్మికి కోటి దండాలు
గోవుమాలక్ష్మికి కోటి దండాలు
కోరినంత పాడి నిండు కడవళ్ళు ఆ..

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ...

మొగడు మెచ్చినచాన కాపురంలోన
మొగలిపూల గాలి ముత్యాల వాన
మొగడు మెచ్చినచాన కాపురంలోన
మొగలిపూల గాలి ముత్యాల వాన
ఇంటి ఇల్లాలికి ఎంత సౌభాగ్యం
ఇంటి ఇల్లాలికి ఎంత సౌభాగ్యం
ఇంటిల్లిపాదికి అంతవైభోగం

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ
ముద్దు మురిపాలలొలుకు ముంగిళ్ళలోన
మూడు పువ్వులు ఆరు కాయల్లు కాయ
ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తైదు కుంకుమ బతుకంత ఛాయ...

https://www.youtube.com/watch?v=HBpR0Ww8aS8


❖❖❖❖❖


SIRI SAMPADA'S
TELUGU VOICE OF AUSTRALIA
WHY INVEST WITH US ?
Duplex villas starting at just ₹34.99lakhs
Located right next to a 1000 acre Green Special Economic Zone On Hyderabad - Bangalore NH 44
Assured monthly returns Upto ₹15000 a month
THE WHITE VILLAS
JADCHERLA
+91 98854 54012 - +91 9908502222
SIRI SAMPADA
Trust . Innovation . Tradition
www.sirisampada.com
In Association With
Telugu Association Sydney

# భరత ఖండము - అక్షర ఖండము- అక్షర భూమి

**శ్రీ శనగవరపు ఉమామహేశ్, మెల్ బోర్న్**

ఆ "అక్షర పద్ధతి/అక్షర వ్యవస్థ" నిర్వచించిన శబ్దాలను వ్రాయటానికి, దాదాపు భరత ఖండములోని అన్ని లిపులకూ వాడబడినది. భరత ఖండములో ప్రాంతము బట్టి అనేక లిపులు ఏర్పడినవి. భారత దేశంలో బుద్ధుని సమయానికే 60 కి పై చిలుకు లిపులు ఉండేవి. ఉదాహరణకి బ్రాహ్మీ లిపి, ఖరోష్ఠి వంటివి అతి ప్రాచీనమైన లిపులు.
ఈ అక్షరక్రమము నేటికీ బిలియన్ల మందిచే వాడబడుతున్నది. సంస్కృతము మృత భాష అనే వారికి ఒక బిలియన్ పై చిలుకు భారతీయులు, దక్షిణాసియా, ఆగ్నేయ ఆసియాలో బ్రతికి ఉన్న వివిధ భాషల భరత ఖండము అనవచ్చు, ఇంకా **అక్షర భూమి లేదా అక్షర ఖండం గా పిలవడం** సబబు గా ఉంటుందేమో అని నా అభిప్రాయము.
.








ఈ అక్షర ఖండంలో ప్రస్తుత కాలపు శ్రీ లంక, భారత దేశము, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, తుర్కెమెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్, తజకిస్తాన్, తిబెట్, నేపాల్, భూటాన్, యునాన్, బంగ్లా దేశ్, బర్మా, లావోస్, థాయిలాండ్, దక్షిణ/పడమర వియత్నామ్, ఫిలిప్పైన్స్, కాంబోడియా, మలేసియా, సింగపూర్, ఇండొనేసియా ఒకప్పుడు శబ్ద (
`

ఈ అక్షరమాల కూర్పును భారతీయ భాషలే కాక దక్షిణాసియా, ఆగ్నేయ ఆసియా, మధ్య ఆసియా ప్రాంతపు అనేక భాషా సముదాయాలు ఆసరాగా తీసుకొన్నవి. దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా , మధ్య ఆసియా లలో ప్రస్తుతం రాజకీయంగా విభజింపబడిన అనేక దేశాలు, సాంస్కృతికంగా మరియు భాషా పరంగా ముఖ్యంగా అక్షరముల కూర్పులో ఏకత్వాన్ని కలిగి ఉన్నాయి, కలిగి ఉండేవి. ఈ సాంస్కృతికమైన భూభాగాన్ని అక్షర వ్యవస్థ) పరంగా సాంస్కృతికంగా సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండేవి.

ఈ ప్రాంతములో మాట్లాడబడే అనేక భాషలు భారతీయ అక్షర వ్యవస్థ తో చాలా దగ్గర సంబంధము కలిగి ఉన్నాయి. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఒక బిలియన్ పై చిలుకు ప్రజలు అక్షర వ్యవస్థనే ఆశ్రయించి నిత్య జీవితములో భాషా వైవిధ్యాన్ని కాపాడుకుంటున్నారు.

**మచ్చుకు కొన్ని అక్షర లిపులు క్రింద ఉదాహరణ గా ఇవ్వబడ్డాయి:**

| | | |
|---|---|---|
| <br>బ్రాహ్మి | देवनागरी लिपि<br>దేవనాగరి | <br>సిద్ధం |
|  ఖరోష్ఠి | తెలుగు<br>తెలుగు | <br>గ్రంథ |
| ಕನ್ನಡ<br>కన్నడ | മലയാളം మళయాళ | தமிழ் எழுத்து<br>తమిళ |
| ਗੁਰਮੁਖੀ<br>గురుముఖి -పంజాబీ (పాకిస్తాన్, భారతదేశం) | ગુજરાતી<br>గుజరాతీ | বাংলা<br>బెంగాలీ (బంగ్లాదేశ్, భారతదేశం) |
| བོད་སྐད།<br>తిబెటన్(తిబెట్) | සිංහල<br>సింహళ(శ్రీలంక) | <br>సింధీ (పాకిస్తాన్) |
| ଓଡ଼ିଆ<br>ఒడియ | <br>చమ్ (వియత్నామ్, కాంబోడియ) | မြန်မာစာ<br>బర్మీస్ (మియన్మార్) |
| ภาษาไทย<br>థాయి | <br>హనునో (ఫిలిప్పైన్) | ພາສາລາວ<br>లావో |
| လိၵ်ႈတႆး<br>షన్ (యున్నన్, చైనా, బర్మా) | ភាសាខ្មែរ<br>ఖ్మేర్ (వియత్నామ్) | <br>జావనీస్ ఇండొనేసియా |

పైన ప్రచురించిన వ్యాసము అక్షర విజ్ఞానం గ్రంథము లోనిది
గ్రంథకర్త : శనగవరపు ఉమామహేశ్, మెల్బర్న్, ఆస్ట్రేలియా
అక్షర విజ్ఞానం గ్రంథము



## బాలవాహిని



చిట్టి చిలకమ్మా
అమ్మ కొట్టిందా
తోటకెళ్ళావా
పండు తెచ్చావా
గూట్లో పెట్టావా
గుటుక్కు మింగావా



వానా వానా వల్లప్పా
వాకిలి తిరుగు చెల్లప్పా
చేతులు చాచు మల్లప్పా
తిరుగు తిరుగు తిమ్మప్పా
తిరగలేను నరసప్పా




పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు
జనులా పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు ఎడతెగక పారు ఏరును
ద్విజుడున్ చొప్పడిన ఊరనుండుము
చొప్పడకున్నట్టి ఊరు చొరకుము సుమతీ!

❖❖❖❖❖


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

# భాషాప్రభావం

శ్రీమతి రాచకొండ ప్రవీణ, సిడ్నీ

మనం వేరే భాష నేర్చుకోడం వలన కలిగే ప్రయోజనాల గురించి మాట్లాడుకుంటున్నాం. విదేశాలలో పెరుగుతున్న మన పిల్లలకి ఆ వేరే భాష ఏదో కాదు తెలుగే!

ఏదైనా పార్టీకి వెళ్ళినపుడు లేదా వేరే భాష మాట్లాడే వారి గుంపులో ఉన్నపుడు, ఆ భాష రాకపోతే, అందరి మధ్యలో ఉండి కూడా మనం వొంటి వాళ్ళం అయిపోతాం. ఒక్కొక్కప్పుడు మీకు ఆ భాష రాదని చెప్పడానికి ఇష్ట పడరు లేదా సిగ్గు పడతారు. దీనివల్ల అందరూ నవ్వుతుంటే మీరూ నవ్వుతారు ఏదో అర్థమయినట్లు లేదా వారి సంభాషణలో పాలు పంచుకుంటున్నట్లు నటిస్తూ! అటువంటి నటన ఎంతకాలం ఆనందాన్ని కలిగిస్తుంది? Australia వంటి దేశాలకు వలస వెళ్ళిన కొత్తలో కేవలం English accent అర్థం కాక మనం అందరం ఈ పరిస్థితి ఎంతో కొంత అనుభవించిన వాళ్ళమే! కొత్త భాష తెలుసుకోవడంవల్ల ఆ group లో భాగమై వారి company ని మరింతగా ఆనందించవచ్చు.

నెల్సన్ మన్డేలా భాష గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు: “If you talk to a man in a language he understands, that goes to his head. If you talk to him in *his* language, that goes to his heart.”

నాకు జరిగిన సంఘటనలు కొన్ని గుర్తుకు వస్తున్నాయి. ఒకసారి మేము India వెళ్ళినపుడు మాతో పాటు మా మేనల్లుడు కూడా వచ్చాడు. మేము రాజమండ్రీ bus station లో మా బస్సు గురించి ఎదురు చూస్తున్నాం. ఇంతలో ఒక పెద్దావిడ “రాజోలు బస్సు ఎక్కడకి వస్తుంది బాబు?” అని మా వాడిని అడిగింది. వాడు తెలుగు మాట్లాడగలడు కానీ చదవడం రాదు. అందుకని ఆమె మాట విననట్టు నటిస్తూ ఎటో చూస్తూ పక్కకి వెళ్ళిపోయాడు. ఈ లోగా మా ఆడపడుచు ఆవిడకు సమాధానం చెప్పి పంపించిందనుకోండి.

కొత్త భాష నేర్చుకుంటే మన వైఖరి మారుతుంది, కొత్త సామర్థ్యం కలుగుతుంది, కొత్త వ్యక్తులతో సాన్నిహిత్యం పెరుగుతుంది. ఇది ముఖ్యంగా ప్రయాణాలలోను పార్టీలలోను అనుభవానికి వస్తుంది. అలాగే నలుగురిలో ఉన్నపుడు ఏదైనా రహస్యం చెప్పాలనుకుంటే వారికి తెలియని భాషలో చెప్పుకోవచ్చు. ఇది సభ్యత్వం కాకపోయినా కొన్ని సందర్భాల్లో ఉపయోగ పడవచ్చు లేదా బెడిసి కొట్టనూవచ్చు. ఒకసారి బంగారం కొనడానికి ఒక దుకాణానికి వెళ్ళాం. చివరకి బేరం దగ్గరకి వచ్చేసరికి సేటు తన assistant తో మజూరీ ఎంత వెయ్యాలి అన్న విషయంలో గుజరాతీలో మాట్లాడుతున్నాడు. వారి సంభాషణ అంతా విన్నాక నేను గుజరాతీలో counter offer ఇచ్చాను. అది విన్న సేటు ముఖంలో కవళికలు చూసి తీరవలసిందే, కత్తి వాటుకి నెత్తురు చుక్క లేకుండా పోయింది పాపం. ఇటువంటి ప్రమాదాలకు తస్మాత్ జాగ్రత!

మనం కొత్త ప్రాంతం వెళ్ళినప్పుడు మన వేషం చూసి స్థానికులు మనకి వారి భాష రాదని అంచనా వేసేస్తారు. ఒకసారి మా ఆఫీసులో traditional dress day రోజు నేను చీర కట్టుకుని రైల్వే platform మీద మా అమ్మాయితో నిలుచున్నా. ఒక తెల్లావిడ పైన మబ్బులని చూపిస్తూ వర్షం పడవచ్చు అని sign language లో నాకు చెప్పడానికి ప్రయత్నిస్తోంది. అది చూసిన మా అమ్మాయి "You can talk to my mum normally in English" అని చెప్పింది ఆవిడ బాధ చూడలేక. అది విన్న ఆవిడ తన చేష్టకి కొంచం ఇబ్బంది పడింది. అందరం నవ్వుకుని ట్రైన్ ఎక్కాం.

మన పిల్లలు తెలుగు బాగా తెలియక తెలుగు చాలా విచిత్రమని అనుకుని అసలు మాట్లాడరు. *నీకు ఏ భాష అయినా విచిత్రం అనిపిస్తే, ఆ భాష వారికి నీ భాష కూడా అంతే విచిత్రం.* నీకు నీ భాష అలవాటైపోయింది అంతే!


కొత్త భాష నేర్చుకోడానికి ముఖ్యమైన మార్గం ఆ భాషలో వచ్చినంత వరకు మాట్లాడడమే. ఆ భాష వారు మీ మాటలకు ముందు నవ్వినా మీ ప్రయత్నాన్ని మాత్రం అభినందిస్తారు. నిజం చెప్పాలంటే వేరే భాష నేర్చుకుంటే మీ చురుకుదనాన్ని పెంచుతుంది. వచ్చీ రాని భాషలో మాట్లాడి సరైన బస్సు ఎక్కి మీ గమ్యం చేరడం ముఖ్యం కానీ రాదని సిగ్గుపడి మరే బస్సో ఎక్కి ఎక్కడికో పోవడం అవివేకం. అందుకే విదేశీ యాత్రలకు వెళ్ళేముందు కొద్దిపాటైనా అక్కడి భాష నేర్చుకోవాలి.

ఏ రంగం వారికైనా వేరే భాష తెలియడంవల్ల నిజమైన ప్రయోజనాలు కలుగుతాయి. ఉదాహరణకి డాక్టర్లు, బ్యాంకర్లు మొదలైన వారికి వేరే భాషల వారితో ప్రతి రోజూ చర్చలు జరుగుతుంటాయి. అదే కాకుండా "Early competencies in another language results in improved reading in English, solving scientific problems more easily and greater ease in learning a third language" అని భాషా పరిశోధకులు అంటారు.

తెలుగు భాష మీ పిల్లల పూర్వ సంస్కృతి. అది వారికి మీరందించగల తరగని ఆస్తి. అది మన సంస్కృతి సాంప్రదాయాలకు ముఖ ద్వారం. మీ పిల్లలకు తెలుగు భాష నేర్పించండి.

❖❖❖❖❖




ARA VAULTS
SAFE DEPOSIT BOXES
SECURE YOUR VALUABLES
BULLION
JEWELLERY
DOCUMENTS
DATA
CURRENCY
WESTERN SYDNEY'S
MOST SECURE SAFE DEPOSIT BOXES
OWNED & OPERATED BY INDUSTRY EXPERTS
Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.
PH: 02 8326 7907
aravaults.com.au

❖❖❖❖❖




తెలుగు అసోసియేషన్ సిడ్నీ



WESTMEAD
DOCTORS



**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

**GENERAL PRACTICE**

Telugu and Hindi speaking
Female GPs
Male GPs

**ALLIED HEALTH**

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

**SPECIALISTS**

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

**ONSITE PATHOLOGY**

# BRAND NEW MELBOURNE CBD & SOUTHBANK APARTMENTS

**1, 2 & 3 beds from $489,000* (Off-the-plan)**




Walk to Melbourne city centre, Arts Precinct, shopping, cafes, restaurants, parks, transport & more.

Easy Access to RMIT & Melbourne University.

Exclusive resident facilities: Indoor pool, gym, terrace courtyard, BBQ, concierge & more.

✔ **Low Owners Corporation Fees (Strata Fees)**

BUY DIRECT *from* AUSTRALIAN OWNED DEVELOPER

**INSPECT IN SYDNEY OFFICE BY APPOINTMENT:**

**299 Elizabeth Street, Sydney**

**1800 44 55 20**

Multilingual staff available, many Indian languages spoken

**centralequity.com.au**

CENTRAL EQUITY 30TH YEAR CELEBRATION

AWARD WINNING MELBOURNE DEVELOPER

*OVER 75 PROJECTS DELIVERED AS PROMISED*

**Price as at 28/6/2018 until sold.*